

పెట్టుబడుల వెల్లువ

జిల్లాలో కంపెనీలు, పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్న పారిశ్రామికవేత్తలు

- కొన్నింటికి ఇప్పటికే శంకుస్థాపనలు
- త్వరలో మరికొన్ని పరిశ్రమలు రాక
- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ పార్కు
- అనకాపల్లి, అచ్యుతాపురంలో గతంలోనే ఏర్పాటు
- తాజాగా మాకవరపాలెం, పరవాడల్లో శంకుస్థాపనలు
- జిల్లాలో యువతకు పెరగనున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు


అచ్యుతాపురం సెజ్‌లో కొత్తగా ప్రారంభమైన ఏటీసీ టైర్ల కంపెనీ

అనకాపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):
కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిన్నర కాలంలోనే అనకాపల్లి జిల్లాలో అనేక పరిశ్రమలు ఏర్పాటుకు పునాదులు పడుతున్నాయి. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు దిగ్గజ కంపెనీలు సైతం క్యూ కడుతున్నాయి. ఇటీవల అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల సరిహద్దులో ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీకి, నక్కపల్లి మండలంలో బల్క్‌డ్రగ్ పార్కుకు శంకుస్థాపన జరగ్గా.. తాజాగా సీఎం చంద్రబాబునాయుడు మంగళవారం వర్చువల్‌గా అచ్యుతాపురం సెజ్‌లో మూడు కొత్త పరిశ్రమలను ప్రారంభించారు. ఇదే సమయంలో ఆరు పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపనలు చేశారు. కొత్త పరిశ్రమల్లో రూ.3,682.96 కోట్లు పెట్టుబడులు పెడతారు. 3,815 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి. త్వరలో నక్కపల్లి మండలంలో 'ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్స్' ఫ్యాక్టరీకి భూమి పూజ జరగనున్నది.

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తున్నది. అనకాపల్లి, ఎలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురంలో ఇప్పటికే ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటయ్యాయి. తాజాగా నర్సీపట్నం నియోజకవర్గంలోని మాకవరపాలెం మండలంలో, పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని పరవాడలో ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు మంగళవారం శంకుస్థాపనలు చేశారు. జిల్లాలో రూ.3 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. ఆయా పరిశ్రమలు ఏర్పాటైతే ... మిగతా 8వ పేజీలో

కూటమి పాలనలో పారిశ్రామిక పరుగులు

రాష్ట్రానికి రూ.లక్షల కోట్లతో పెట్టుబడులు

- లక్షలాది మందికి ఉద్యోగాలు, ఉపాధి
- ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర



సభలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర. వేదికపై హోం మంత్రి అనిత, ఎమ్మెల్యే సుందరపు, కలెక్టర్ విజయకృష్ణన్.

అచ్యుతాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):
కూటమి అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే రాష్ట్రం పారిశ్రామిక దిశగా పరుగులు తీస్తున్నదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు మంగళవారం వర్చువల్‌గా మండలంలో నిర్మించిన మూడు పరిశ్రమలను ప్రారంభించి, మరో ఆరు పరిశ్రమలు/ కంపెనీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సెజ్‌లోని యోకోహామా కంపెనీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ల కృషికారణంగా రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయని, దీంతో లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం పారిశ్రామికంగా కుదేలైందని విమర్శించారు.

హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, భవిష్యత్‌లో అనకాపల్లి జిల్లా పారిశ్రామికాభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలుస్తుందని అన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన యోకోహామా టైర్ల కర్మాగారంలో ఉపాధి కల్పనలో మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. మహిళల ఉపాధి కోసమే కర్మాగారం ఏర్పాటు చేయడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం యోకోహామా కర్మాగారం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఏపీఎస్ఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, కలెక్టర్ విజయకృష్ణన్, పరిశ్రమల శాఖ జీఎం ప్రసాద్, ఏపీఐఐసీ జడ్‌ఎం నరసింహారావు, ఆర్డీఓ ఆయీషా తదితరులు పాల్గొన్నారు.

లక్ష ఉద్యోగాల కల్పనే లక్ష్యం

పారిశ్రామిక హబ్‌గా 'నర్సీపట్నం'

- ఉద్యోగాల కల్పనలో స్థానిక యువతకు ప్రాధాన్యం
- శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- ఎరకన్నపాలెంలో ఎంఎస్‌ఎంఈ పార్కుకు శంకుస్థాపన


ఎంఎస్‌ఎంఈ పార్కు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):
కూటమి హయాంలో జిల్లాలో లక్ష మందికి ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. రాచపల్లి రెవెన్యూ పరిధిలోని ఎరకన్నపాలెంలో ఎంఎస్‌ఎంఈ పార్కు నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రవ్యాప్తంగా 48 ఎంఎస్‌ఎంఈ పార్కులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారని, ఇందులో భాగంగా ఇక్కడ భూమి పూజ చేశామని చెప్పారు. ముఖ్యమంత్రి సంకల్పంతో నర్సీపట్నం నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు మొదటి అడుగు పడిందన్నారు. 410 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఎంఎస్‌ఎంఈ పార్కులో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపన ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అభిస్తాయన్నారు. ఉద్యోగాల కల్పనలో భూములు ఇచ్చిన నిర్వాసితులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తరువాత స్థానిక మండల యువతకు ఉపాధి కల్పించాలని ఆయన అన్నారు. ఎంఎస్‌ఎంఈతోపాటు ఇతర ప్రైవేటు కంపెనీలకు ప్రభుత్వ భూములు కేటాయించినప్పటికీ, వీటిని సాగు చేసుకుంటున్న వారికి 571 జీవో ప్రకారం నష్టపరిహారం అందజేస్తామన్నారు. 150 ఎకరాల్లో రూ.1,234 కోట్లతో డోస్కో కంపెనీ ఏర్పాటవుతున్నదని, ఇందులో 1,200 మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. త్వరలో ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీ కూడా ఏర్పాటవుతుందని చెప్పారు. రామన్నపాలెం సెంటర్ నుంచి ఎలమంచిలి వద్ద జాతీయ రహదారిని కలుపుతూ 18 అడుగుల వెడల్పుతో సుమారు 10 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం జరుగుతుందని అయ్యన్నపాత్రుడు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో రమణ, తహశీల్దార్ వెంకటమణ, సర్పంచ్ సీతారాముడు, జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి సూర్యచంద్ర, టీడీపీ నాయకులు జోగిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు, రుత్తల జోగిపాత్రుడు, అల్లు రామునాయుడు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

పరవాడలో..

పరవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పరవాడ రెవెన్యూ పరిధిలో ఏపీఐఐసీకి చెందిన ఫేజ్-2 స్థలంలో ఎంఎస్‌ఎంఈ పార్కుకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శంకుస్థాపన చేశారు. ఇక్కడ 50 ఎకరాల్లో 99 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు అవుతాయని ఆయన చెప్పారు. ఒక్కో యూనిట్‌కు కనిష్ఠంగా 300 గజాలు, గరిష్ఠంగా 1,500 గజాల స్థలాన్ని కేటాయిస్తున్నట్టు తెలిపారు.

అరకు కాఫీని ప్రోత్సహించాలి

అన్ని వేడుకల్లో చోటు కల్పించాలి

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- నర్సీపట్నంలో 'నేటివ్ అరకు కాఫీ' స్టాల్ ప్రారంభం



స్టాల్‌ను ప్రారంభించిన అనంతరం కాఫీ తాగుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు

నర్సీపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):
నియోజకవర్గంలో జరిగే అన్ని రకాల వేడుకలకు 'అరకు కాఫీ'ని ప్రోత్సహించాలని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక శారదానగర్ మెయిన్ రోడ్డు చివర పొదుపు సంఘం మహిళ ఏర్పాటు చేసిన 'నేటివ్ అరకు కాఫీ' స్టాల్‌ను స్పీకర్ దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అరకు కాఫీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని, అందువల్ల రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో 'నేటివ్ అరకు కాఫీ' స్టాల్స్ ఏర్పాటును ఎమ్మెల్యేలు ప్రోత్సహించాలని, దీనివల్ల ఎంతోమందికి ఉపాధి లభిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా అయ్యన్న దంపతులు అరుకు కాఫీ తాగారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు సుకల అప్పలనాయుడు, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, కౌన్సిలర్ చింతకాయల రాజేశ్, ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి వెంకట రమణ, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, నేటివ్ కంపెనీ సీఈవో రామ్‌కుమార్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో రెండో రోజూ తనిఖీలు

- ప్రయాణికుల లగేజీ నిశితంగా పరిశీలన


రైలు బోగీలో ప్రయాణికుల లగేజీని సోదా చేస్తున్న ఏఎస్ఐ బాబు, సిబ్బంది


ప్లాట్‌ఫారంపై ప్రయాణికులతో మాట్లాడుతున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

అనకాపల్లి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):
స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ అధికారులు, సిబ్బంది మంగళవారం కూడా ఆ విస్తృతంగా తనిఖీలు చేశారు. ఢిల్లీలో సోమవారం సాయంత్రం జరిగిన భారీ పేలుడు నేపథ్యంలో జిల్లా పోలీసులతో పాటు ఆర్‌పీఎఫ్ అధికారులు కూడా అప్రమత్తమై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏఎస్ఐ బాబు, సిబ్బం ది మంగళవారం పలు రైళ్లల్లో మెటల్ డిటెక్టర్‌తో ప్రయాణికుల లగేజీని నిశితంగా పరిశీలించారు.ప్లాట్‌ఫారంపై ప్రయాణికులతో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

ఏసీబీ వలలో ఎం.అలమండ వీఆర్వో

మ్యుటేషన్ కోసం రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం


ఏసీబీ అధికారులకు చిక్కిన వీఆర్వో సూర్యనారాయణ

దేవరాపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):
తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని ఆన్‌లైన్‌లో మ్యుటేషన్ చేయడానికి ఎం.అలమండ వీఆర్వో రూ.20 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారుల వలకు చిక్కాడు. ఇందుకు సంబంధించి ఏసీబీ విశాఖపట్నం డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి మంగళవారం సాయంత్రం ఇక్కడ మీడియాకు వెల్లడించిన వివరాలిలావున్నాయి.

మండలంలోని పెదనందిపల్లికి చెందిన వేచలపు శ్రీరామమూర్తి చనిపోవడంతో అతనికి చెందిన 55 సెంట్ల భూమిని తన పేరుమీద మార్చాలని ఆయనకుమారుడు వేచలపు సూర్యనారాయణ రెవెన్యూ శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ గ్రామం ఎం.అలమండ రెవెన్యూ పరిధిలో వుండడంతో సదరు వీఆర్వో చుక్కా సూర్యనారాయణను కలిసి, మ్యుటేషన్ చేయాలని కోరారు. ఈ పని చేయాలంటే రూ.25 వేలు లంచం ఇవ్వాలని వీఆర్వో డిమాండ్ చేశాడు. అంత సొమ్ము ఇచ్చుకోలేనని రైతు బతిమాలడంతో చివరకు రూ.20 వేలకు తగ్గేది లేదని వీఆర్వో స్పష్టం చేశాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని సూర్యనారాయణ ఈ విషయాన్ని తన మేనమామ కుమారుడు సోమిరెడ్డి అమ్మతల్లినాయుడు దృష్టికి తీసుకెళ్లాడు. ఆయన సూచనతో ఈ నెల 9వ తేదీన విశాఖపట్నం వెళ్లి ఏసీబీ అధికారులను కలిశారు. డీఎస్పీ రమణమూర్తి ఇచ్చిన సలహాతో సూర్యనారాయణ మంగళవారం వీఆర్వోకు ఫోన్ చేసి, రూ.20 వేలు లంచం సొమ్ము ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. దేవరాపల్లి-ఆనందపురం రోడ్డులో నల్లబల్లి కల్లాల వద్దకు రమ్మని చెప్పడంతో రైతు అక్కడకు వెళ్లి రూ.20 నగదు ఇచ్చారు. అప్పటికే సమీపంలో మాటు వేసి వున్న ఏసీబీ అధికారులు దాడి చేసి, వీఆర్వోను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చి విచారణ చేశారు. అనంతరం వీఆర్వోను అరెస్టు చేసి తమ వెంట తీసుకెళ్లారు. బుధవారం ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో సీఐలు లక్ష్మణరావు, సుప్రియ, వెంకటరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మురికికూపంగా పుష్కరిణి

చెత్తాచెదారం పేరుకుపోయి తీవ్ర దుర్వాసన

- కార్తీక మాసంలో పుణ్యస్నానాలకు దూరమైన భక్తులు
- శంకుస్థాపనకే పరిమితమైన అభివృద్ధి పనులు



పాచి పేరుకుపోయి ఆకుపచ్చగా మారిన పుష్కరిణి నీరు. (ఇన్‌సెట్‌లో) స్వయంభూ గౌరీశ్వరాలయం

చోడవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):
స్థానిక స్వయంభూ గౌరీశ్వరాలయానికి నియోజకవర్గంలోనే కాకుండా ఉమ్మడి జిల్లాలో ఎంతో పేరు ప్రఖ్యాతులు వున్నాయి. కార్తీక మాసంలో ఎంతో మంది భక్తులు ఆలయానికి వచ్చి, పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. కార్తీక పౌర్ణమి, పోలి పాడ్యమి రోజుల్లో మహిళలు పుష్కరిణిలో దీపాలు వదులుతుంటారు. అయితే దేవదాయ శాఖ అధికారుల తీరుకారణంగా కొన్నాళ్ల నుంచి అధ్వానంగా తయారై నిరుపయోగంగా మారింది. నాచు, చెత్తాచెదారం పేరుకుపోయి మురికి కూపంలా తయారైంది. పుష్కరిణి సమీపంలోకి వెళితే తీవ్ర దుర్వాసన వస్తున్నది. ప్రముఖమైన శైవక్షేత్రాలలో ఒకటైన స్వయంభూ గౌరీశ్వరాలయంలో శివుడిని దర్శించుకునేందుకు ఎక్కడెక్కడినుంచో భక్తులు తరలివస్తుంటారు. అటువంటి ఆలయంలోని పుష్కరిణి ఇప్పుడు డంపింగ్ యార్డును తలపిస్తున్నది. ఇందుకు గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యమే కారణమని భక్తులు ఆరోపిన్నారు. చుట్టూ ఉండే స్థానికులు ఇళ్లలోని చెత్తను పుష్కరిణిలో వేస్తున్నారు. కొంతమంది పశువులను పుష్కరిణిలోకి విడిచిపెట్టి, వాటిని కడుగుతున్నారు.

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పుష్కరిణిని అభివృద్ధి చేయడానికి స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు రూ.80 లక్షలు మంజూరు చేయించారు. గత ఏడాది నవంబరులో శంకుస్థాపన చేశారు. పుష్కరిణి చుట్టూ ఘాట్‌లు నిర్మించడం, చెరువు ... మిగతా 8వ పేజీలో

ఎలమంచిలిలో 15 నుంచి ప్లాస్టిక్ నిషేధం

విక్రయించినా, వినియోగించినా జరిమానా

- వ్యాపారులకు మునిసిపల్ కమిషనర్ విస్పష్టం


వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు

ఎలమంచిలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):
ప్రభుత్వ ఆదేశాల మేరకు మునిసిపాలిటీలో ఈ నెల 15వ తేదీ నుంచి ప్లాస్టిక్ కవర్ల విక్రయం, వినియోగంపై నిషేధం విధిస్తున్నట్టు మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయం ఆవరణలో వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆదేశాలను పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. మునిసిపాలిటీలో ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలన్నారు. అందరూ వస్త్ర/ నార సంచులు వినియోగించాలన్నారు. అయితే ప్లాస్టిక్ నిషేధం అమలుకు కొంత సమయం ఇవ్వాలని వ్యాపారులు కోరగా.. కమిషనర్ సున్నితంగా తిరస్కరించారు. 15వ తేదీ నుంచి ప్లాస్టిక్ కవర్లు విక్రయించినా, వినియోగించినా అపరాధ రుసుం విధిస్తామని స్పష్టం చేశారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా

తేజ్ భరత్


ఎన్.తేజ్ భరత్

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):
విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మెట్రోపాలిటన్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి ఎన్.తేజ్ భరత్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన ప్రస్తుతం మెప్మా డైరెక్టర్‌గా విజయవాడలో పనిచేస్తున్నారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న విశ్వనాథన్‌ను గత నెల తొమ్మిదో తేదీన ఐ అండ్ పీఆర్ డైరెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసిన సంగతి తెలిసిందే. విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆయన సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయానికి తరచూ వెళుతున్నా పెట్టుబడుల సదస్సు కారణంగా వీఎంఆర్‌డీఏపై పూర్తిగా దృష్టి పెట్టలేకపోతున్నారు. ముఖ్యంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమయ్యేలోగా ఏడు మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించే బాధ్యతను ప్రభుత్వం వీఎంఆర్‌డీఏకు అప్పగించింది. విశ్వనాథన్ వెళ్లిన ... మిగతా 8వ పేజీలో

నేడు పెట్టుగోళ్లపల్లిలో హోంమంత్రి అనిత పర్యటన

ఎస్.రాయవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెట్టుగోళ్లపల్లి గ్రామంలో బుధవారం ఉదయం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పర్యటించనున్నారని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి తెలిపారు. జలజీవన్ మిషన్ నిధులతో నిర్మించిన రక్షిత నీటి పథకానికి ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని కూటమి నాయకులు, శ్రేణులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు మాదక ద్రవ్యాల నిర్మూలనపై పేట నుంచి సైకిల్ ర్యాలీ ప్రారంభం

పాయకరావుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు, గంజాయి, మత్తుపదార్థాల దుష్ప్రభావాలు, అక్రమ రవాణాను అరికట్టే దిశగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బుధవారం పాయకరావుపేట నుంచి శ్రీకాకుళం జిల్లా వరకు 25 రోజుల పాటు సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు. విశాఖపట్నం రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాలో నిర్వహించే ఈ ర్యాలీని హోం మంత్రి వంగలపూడి అనిత ప్రారంబిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డీఐజీ గోపినాథ్ జెట్టి, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా పాల్గొంటారన్నారు.

ఇన్‌చార్జి మంత్రి రవీంద్రను కలిసిన టీడీపీ నేతలు



జిల్లా ఇన్‌చార్జి మంత్రి రవీంద్రను కలిసిన టీడీపీ నాయకులు

మునగపాక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్రను టీడీపీ మండల నాయకులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాస రావు, తెలుగు మహిళాధ్యక్షురాలు జిల్లా ఆడారి మంజు, టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్, ప్రసాద్ మాట్లాడుతూ విశాఖ విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిసి మండలంలో పార్టీ పరిస్థితి గురించి వివరించామన్నారు.

720 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ : ఏవో

ఎలమంచిలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతాంగానికి ఇప్పటి వరకూ 720 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశామని వ్యవసాయాధికారి మోహనరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలానికి 700 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా.. రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్ సొసైటీ ద్వారా 720 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశామన్నారు. రైతుల పాసు పుస్తకం, ఆధార్ కార్డు పరిశీలించి, డీబీటీ పద్ధతిలో విస్తీర్ణం బట్టి 3వ దఫా పొటాష్, ఎరువుతో కలిపి రైతులకు సరఫరా చేశామన్నారు.

పుంత ముసలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

పాయకరావుపేట రూరల్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజగోపాలపురం పుంతలోని ముసలమ్మ ఆలయంలో మంగళవారం పూజలు ఘనంగా నిర్వహించారు. కార్తీక వన సమారాధనలో భాగంగా గిన్నె దుర్గారెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయంలో రెండు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భజనలు చేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం దుర్గారెడ్డి ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, శివ దీక్ష చేసిన భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టి.సిరసపల్లి మహిళలు ఆదర్శం

▸▸ గౌరీ సంక్షేమ సంఘం క్లస్టర్ అధ్యక్షుడు ఆనంద్

మునగపాక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేవలం పురుషులకే పరిమితమైన సింహాద్రి అప్పన్న సేవగరిడీలో భాగస్వాములైన టి.సిరసపల్లి మహిళలు ఆదర్శంగా నిలుస్తారని గౌరీ సంక్షేమ సేవా సంఘం క్లస్టర్ అధ్యక్షుడు పొలమరశెట్టి ఆనంద్ అన్నారు. సింహాద్రి అప్పన్న సేవ చేయడానికి ముందుకొచ్చి శిక్షణ పొందిన మహిళలకు ఇత్తడి తాళాలను సోమవారం రాత్రి ఆనంద్ వితరణ చేశారు. కార్యక్రమంలో పొలమరశెట్టి వెంకటనాగ రామారావు, ఎంపీటీసీ సభ్యుడు మద్దాల వీరునాయుడు, పొలమరశెట్టి బాగేశ్వరరావు, జగ్గారావు, చినబాబు, మహిళలు పాల్గొన్నారు.

నేడు హరిపాలెం గౌరీపరమేశ్వరుల ఉత్సవం



ఉత్సవం పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రగడ నాగేశ్వరరావు, తదితరులు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపాలెంలో బుధవారం గౌరీపరమేశ్వరుల ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పోస్టర్‌ను చోడపల్లి వద్ద .. ఎస్‌టీబీఎల్‌లో తన నివాసం వద్ద ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆవిష్కరించారు. గ్రామ పెద్దలు, దాతల సాయంతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామంలో భారీగా విద్యుత్ దీపాలు, సెట్టింగ్‌లతో అలంకరించారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పీలా తులసీరామ్, ఉత్సవ కమిటీ చైర్మన్ మారిశెట్టి ప్రసాద్, నాయకులు కాండ్రేగుల సూర్యనారాయణ, కాండ్రేగుల అప్పారావు, కాండ్రేగుల జోగినాయుడు, కాండ్రేగుల వెంకటరమణ, కాండ్రేగుల రాంప్రసాద్, సరగడం అప్పలనాయుడు, అప్పారావు, కాండ్రేగుల వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న సర్పంచ్ దంపతులు, భక్తులు

కోటవురట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాపిరాజు కొత్తపల్లి గ్రామంలో మంగళవారం అభయాంజనేయ స్వామి ఆలయ ఐదో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పెట్ల లింగంనాయుడు దంపతులు ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకాలు, సిందూరంతో పూజలు తమలపాకులతో అర్చనలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

టెలికం బోర్డు జిల్లా మెంబరుగా కువల కుమార్



కువల కుమార్

పాయకరావుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా టెలికం బోర్డు మెంబరుగా పాయకరావుపేటకు చెందిన బీజేపీ పట్టణ అధ్యక్షుడు కువల కుమార్ నియమితులయ్యారు. మంగళవారం ఈమేరకు నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఆశీస్సులు, రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ నిర్మాణాలు రెగ్యులైజేషన్ చేసుకోకుంటే కూల్చివేస్తాం

▸▸ వీఎంఆర్డీఏ ఏపీఓ పి.అమ్మాజీరావు



పంచాయతీ కార్యదర్శికి సూచనలిస్తున్న వీఎంఆర్డీఏ ఏపీఓ అమ్మాజీరావు

పాయకరావుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ ఏడాది ఆగస్టు 31లోపు అక్రమ నిర్మాణాలను బీపీఎస్ ద్వారా రెగ్యులైజేషన్ చేసుకోకుంటే వాటిని కూల్చివేస్తామని వీఎంఆర్డీఏ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ పి.అమ్మాజీరావు హెచ్చరించారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలో అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై చర్చించారు. పంచాయతీ అనుమతి లేని, ప్లాన్‌కి విరుద్ధంగా జరిగిన నిర్మాణాలు, అక్రమ లేఅవుట్లు గుర్తించి నోటీసులు జారీ చేయాలని సూచించారు. అనంతరం ఏపీవో అమ్మాజీరావు మాట్లాడుతూ పట్టణంలో ప్లాన్ అప్రూవల్ లేని, నిబంధనలు పాటించకుండా ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీలోపు నిర్మాణాలు పూర్తిచేసిన వారు తప్పనిసరిగా బీపీఎస్ ద్వారా రెగ్యులైజేషన్ చేసుకోవాలన్నారు. లేకుంటే పంచాయతీరాజ్ శాఖ చట్టం ప్రకారం కూల్చి వేస్తామన్నారు. అదేవిధంగా ఆగస్టు 31లోగా నిర్మాణం పూర్తికాని అక్రమ నిర్మాణాలకు బీపీఎస్ వర్తించదని, వాటి యజమానులు తక్షణం పనులు నిలిపివేసి వీఎంఆర్డీఏ నుంచి కొత్తగా ప్లాన్ అప్రూవల్ తీసుకున్న తరువాతనే పనులు తిరిగి చేపట్టాలన్నారు. లేకుంటే నిర్మాణం జరిగినంత వరకు కూల్చివేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి కె.డేవిడ్, జూనియర్ అసిస్టెంట్ వరహాలు, సిబ్బంది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని భవన నిర్మాణదారులకు నోటీసులు

నక్కపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):నక్కపల్లి పంచాయతీ పరిధిలో ప్లాన్ అప్రూవల్ లేకుండా భవన నిర్మాణాలు చేపట్టే వారికి నోటీసులు జారీ చేయాలని వీఎంఆర్‌డీఏ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ పీ అమ్మాజీరావు పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్‌కు సూచించారు. మంగళవారం నక్కపల్లి సచివాలయంలో సెక్రటరీ రాజశేఖర్‌తో సమావేశమయ్యారు. అనుమతుల్లేకుండా భవనాలు నిర్మించే వారిని గుర్తించాలని సూచించారు. ప్లాన్ అప్రూవల్ లేకుండా ఎవరైనా కట్టడాలు చేపడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ ఎన్.సతీశ్ కుమార్ పాల్గొన్నారు.

వెజిట్రబుల్స్

మొంథా తుఫాన్ ఎఫెక్టు... రెట్టింపైన కూరగాయల ధరలు



మార్కెట్‌లో విక్రయిస్తున్న కూరగాయలు

నక్కపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం కూరగాయల పంటలపై పడడంతో ధరలు మండిపోతున్నాయి. తుఫాన్ వర్షాలకు పలు కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. కూరగాయల ఉత్పత్తి తగ్గిపోవడంతో ఒక్కసారిగా వీటికి డిమాండ్ ఏర్పడింది. నిన్న మొన్నటి వరకూ కిలో రూ.30 నుంచి రూ. 40లు ధర పలికే కూరగాయల ధరలు నాలుగు రోజుల నుంచి రెట్టింపయ్యాయి. కిలో నలుపు వంకాయలు రూ.100 పలకగా, తెల్ల వంకాయలు కిలో రూ.80లు ధర పలుకుతున్నాయి. బెండ, దొండ, బీర కాయల ధరలు కూడా మంగళవారం నాటికి కిలో రూ.80లకు చేరుకున్నాయి. వారపు సంతల్లో కూరగాయలు విక్రయించే చిరు వ్యాపారులు కూడా ఎక్కువ రేట్లకే వీటిని కొనుగోలు చేసి, మార్కెట్లో విక్రయిస్తున్నారు. దీంతో వినియోగదారులు కూరగాయలు కొనుగోలు చేయలేక ఇబ్బంది పడుతున్నారు.

వైభవంగా దల్లమాంబ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



వెదుళ్ల ఉత్సవం జరుగుతున్న దృశ్యం

రాంబిల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిమిలి గ్రామంలో మంగళవారం దల్లమాంబ అమ్మవారి జాతర వైభోగంగా జరిగింది. మూడేళ్ల కొకసారి జరిగే ఈ అమ్మవారి జాతరను గ్రామస్థులు కన్నుల పండువగా జరుపుకున్నారు. స్థానికులే కాకుండా సమీప గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలతో పూజించారు. పలువురు రాజకీయ ప్రముఖులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 7 గంటలు వరకు గ్రామంలో వెదుళ్ల ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు అమ్మవారిని స్మరిస్తూ పూజలు చేశారు. ఈ సందర్భంగా భారీగా బాణసంచా కాల్చారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సీఐ నర్సింగరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించి, విజేతలకు నిర్వాహక పెద్దలు బహుమతులు అందజేశారు.

ఘనంగా బీసీటీ ట్రస్టు వార్షికోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న నూతన అధ్యక్షులు ఎల్‌వీ సుబ్రహ్మణ్యం

రాంబిల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం భాగవతుల చారిటబుల్ ట్రస్టు (బీసీటీ) 50వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీసీటీ నూతన అధ్యక్షుడు ఎల్‌వీ. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బీసీటీ వ్యవస్థాపకులు కీర్తిశేషులు డాక్టర్ బీవీ పరమేశ్వరరావు గ్రామాల ప్రజల దీర్ఘకాల ప్రయోజనాలు అందాలనే ఆశయంతో ఈ సంస్థను స్థాపించారన్నారు. 1976లో బీసీటీ సంస్థను స్థాపించి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు విద్య, వైద్యం, వ్యవసాయం, పర్యావరణం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక చైతన్యానికి సంస్థ ఎనలేని కృషి చేసిందన్నారు. బీసీటీ కార్యదర్శి బి. శ్రీరామూర్తి మాట్లాడుతూ బీసీటీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అన్ని రకాల కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. బీసీటీ ముఖ్య సలహాదారు ఆదినారాయణ మాట్లాడుతూ ఆ రోజుల్లో గ్రామాల్లో పొదుపు అనే కార్యక్రమం చేపట్టి రోజుకు రూ.50 పైసలతో 3 గ్రామాల్లో 15 గ్రూపులతో మొదలుపెట్టి 1500 గ్రూపులుగా తయారు చేసి, పొదుపుపై మహిళలను చైతన్యం చేశారన్నారు. శిక్షణ పొందిన మహిళలు వివిధ రకాల ఆహార ఉత్పత్తులు తయారు చేసి స్టాల్స్ ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో బీసీటీ ఉపాధ్యక్షుడు రావు తటవర్తి, కోశాధికారి కృష్ణజ్యోతి ,సెంట్రల్ కో-ఆర్డినేటర్ సీతారామరాజు, బీసీటీ కేవీకే శాస్త్రవేత్తలు, బీసీటీ జనరల్ బాడీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సరైన సమయంలో కృత్రిమ గర్భధారణ చేయించాలి

▸▸ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు వడ్డి శ్రీధర్



పశు వైద్య గర్భకోశ చికిత్స శిబిరంలో మందులను పంపిణీ చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాడి పశువులలో సరైన ఎద సమయంలో కృత్రిమ గర్భధారణ చేయించాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు వడ్డి శ్రీధర్ అన్నారు. మండలంలోని రాజవరంలో మంగళవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో జిల్లా లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సహాయంతో ఉచిత పశు వైద్య గర్భకోశ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా పశువులు 3 వారాలకొకసారి ఎదకు వస్తాయన్నారు. ఎద కాలం ఆవుల్లో 18 నుంచి 24 గంటలు, గేదెలలో 24 నుంచి 36 గంటలు ఉంటుందనారు. ఈ సందర్భంగా పశువుల గర్భకోశ వ్యాధుల నివారణ, తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఈ శిబిరంలో 94 పశువులకు వైద్య సేవలు అందించినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోసల అమ్మాజీ, టీడీపీ నాయకులు బొంది కాశీవిశ్వనాథ్, రాజవరం కాలువ చైర్మన్ పిరుమళ్ల గోవిందు, వైద్యులు గుప్తా, శ్రీనివాస్, శరణ్య, సిబ్బంది, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

మండలంలోని దేవవరం శివారు ఒడ్డిమెట్ట గ్రామంలో మంగళవారం పశువుల ఉచిత గర్భ కోశ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. పశువుల పునరుత్పత్తిపై పశువైద్యశాఖ సహాయ సంచాలకులు వీర్రాజు, గొడిచెర్ల పశు వైద్యాధికారిణి డాక్టర్ కృపావతి పశువుల పునరుత్పత్తి, యాజమాన్య పద్ధతులు, లింగ నిర్ధారణ, పశు వీర్యం వినియోగంపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఏఎంఎస్ చైర్మన్ దేవర సత్యనారాయణ, గ్రామ పెద్దలు గొర్ల నర్సింహహరార్జి, వేగేశ్న చంటిరాజు, ఉమ్మడి విశాఖ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సభ్యుడు నల్లల రామకృష్ణ, పశు వైద్యాధికారులు కీర్తి, హన కుమారి పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న బస్సు... 20 మందికి స్వల్పగాయాలు



ఆస్పత్రిలో క్షతగాత్రులు

అచ్యుతాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సెజ్‌లోని ఒక ప్రైవేటు కంపెనీకి మహిళా ఉద్యోగులను తీసుకువెళుతున్న బస్సు మంగళవారం తెల్లవారుజామున దిబ్బపాలెం వద్ద ముందు వెళుతున్న లారీని ఢీకొనడంతో 20 మంది స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాలిలా వున్నాయి. సెజ్‌లోని ఒక దుస్తుల తయారీ కంపెనీకి చెందిన మహిళా ఉద్యోగులు మంగళవారం ఉదయం షిఫ్ట్‌కి హాజరయేందుకు తెల్లవారుజామున బస్సులో వస్తున్నారు. దిబ్బపాలెం జంక్షన్ వద్ద మలుపులో గోతులు ఉండడంతో లారీ డ్రైవర్ వేగం తగ్గించాడు. బస్సు డ్రైవర్ గమనించకుండా లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. పెద్ద కుదుపు రావడంతో మహిళల ముఖాలు ముందు సీట్లకు తగిలి పలుచోట్ల గాయాలయ్యాయి. క్షతగాత్రులను అచ్యుతాపురంలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

దఫ దఫాలుగా యూరియా సరఫరా చేస్తున్నాం

▸▸ మండల వ్యవసాయాధికారిణి జ్యోత్స్నకుమారి



మునగపాక రైతు సేవా కేంద్రం నుంచి యూరియా తీసుకు వెళ్తున్న రైతులు

మునగపాక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ మొదలైన నాటి నుంచి దపదఫాలుగా రైతులకు యూరియా సరఫరా చేస్తూనే ఉన్నామని మండల వ్యవసాయాధికారిణి సీహెచ్.జ్యోత్స్నకుమారి తెలిపారు. మండలంలో మునగపాక, చూచుకొండ తదితర గ్రామాల్లో మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనతోపాటు రైతు సేవా కేంద్రాలను కూడా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మునగపాక రైతు సేవా కేంద్రానికి 222 బస్తాలు రాగా సోమవారం 130 మందికి, మంగళవారం మిగిలిన 92 మందికి అందజేశామన్నారు. చూచుకొండ రైతు సేవా కేంద్రానికి వచ్చిన 100 బస్తాలను మంగళవారం రైతులకు అందజేశామన్నారు. పల్లపు ఆనందపురం గ్రామానికి చెందిన వంద మంది రైతులకు టోకెన్‌లు ఇచ్చామని, వారికి 12 వ తేదీ ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలంలో సాగులో ఉన్న వరి, చెరకు పంటలకు సరిపడా యూరియా సరఫరా జరిగిందన్నారు. వాస్తవానికి ఖరీఫ్ సీజన్‌లో 550 మెట్రిక్ టన్నులు అవసరం కాగా.. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా ఉన్న రైతు సేవా క్రేందాలు, పీఏసీఎస్‌లు ద్వారా 698 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందజేశామన్నారు. సేవా కేంద్రం తెరిచే సమయానికి ముందే రైతులు రావడం, దొరకదేమోనన్న అపనమ్మకంతో పోటీపడడం వలన కొంత గందరగోళ పరిస్థితికి దారితీస్తోందన్నారు. రైతులు భయం వీడి సహకరిస్తే పంపిణీ ప్రశాంతంగానే జరుగుతుందన్నారు.

ధాన్యం సేకరణ చేపట్టాలి

▸▸ పౌరసరఫరాల శాఖ డివిజనల్ మేనేజరు పి.జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న డివిజనల్ మేనేజరు పి.జయంతి

పాయకరావుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ధాన్యం సేకరణ చేపట్టాలని పౌర సరఫరాల శాఖ డివిజనల్ మేనేజరు పి.జయంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో నియోజకవర్గంలోని ఏఓలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి ఖరీఫ్ ధాన్యం సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో పంట కోతలు ప్రారంభం కానున్నందున రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. మద్దతు ధర, గన్నీ బ్యాగ్స్, రవాణా, లేబర్ చార్జీల కింద రైతుకు చెల్లించే ధరపై అవగాహన కల్పించాలన్నారు. మండల కమిటీ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ పంటను విక్రయించుకునేలా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అనంతం టెక్నికల్ అసిస్టెంట్ రవితేజ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి చేపట్టాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఎస్‌ఏ.మహేశ్వరరావు, ఏఓలు సౌజన్య, సరోజ తదితరులు పాల్గొన్నారు.

'లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం'



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ జ్యోతి

పాయకరావుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని డిప్యూటీ డీఎంహెచ్ఓ జ్యోతి అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఆసుపత్రుల్లో రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని,చేసినవారు, చేయించుకున్న వారు, ప్రోత్సహించివారు శిక్షార్హులవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీవిద్య, ఎంపీఈఓ నెహ్రూ, సూపర్‌వైజర్ లలిత తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వైభవ వేంకటేశ్వరస్వామి కల్యాణం



వైభవ వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొలువైన వైభవ వేంకటేశ్వరస్వామి కల్యాణం మంగళవారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బొలిశెట్టి గోవిందరావు, శారదకుమారి దంపతులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలను కన్నుల పండువగా జరిపించారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి తిరువీధిలో ఉత్సవమూర్తులను పల్లకిపై ఊరేగించారు. దీంతో వీధులన్నీ గోవింద నామస్మరణతో మార్మోగాయి. అనంతరం రాత్రికి వేదపండితులు వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఎంతో వైభవంగా జరిపించారు. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని కనులారా చూసి తరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కొణతాల శ్రీనివాస రావు, టీడీపీ నేత సోమిరెడ్డి రాజు, పులి సత్తిబాబు పాల్గొన్నారు.

'వైద్య కళాశాల ప్రైవేటీకరణను విరమించుకోవాలి'



ఎలమంచిలిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

ఎలమంచిలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ప్రభుత్వం విరమించుకోవాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మంగళవారం ఎలమంచిలిలోని వైసీపీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనరు ధర్మశ్రీ, ఎంపీపీ బోదెపు గోవింద్, స్థానిక నేతలతో కలిసి ప్రజా ఉద్యమం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ వైద్య కళాశాలల పీపీపీ విధానానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు బొడ్డేడ ప్రసాద్, బొద్దపు యర్రయ్యదొర, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరైపు గుప్తా పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు 'పేట' విద్యార్థులు ఎంపిక

పాయకరావుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 10వ తేదీ వరకు విజయనగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో అండర్-19 విభాగంలో తమ విద్యార్థులు ఎస్.శశికిరణ్, కె.కావ్యసుధ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అదేవిధంగా ఏపీ స్కేటింగ్ అసోసియేషన్(కాకినాడ) ఆధ్వర్యంలో జరిగిన రోలర్ స్కేటింగ్ పోటీల్లో 500 మీటర్ల మిక్స్‌డ్ రిలే విభాగంలో తమ విద్యార్థి టి.కళానిధి ప్రతిభ కనబర్చి రెండు రజిత పతకాలు సాధించాడని తెలిపారు. విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి, వైస్‌ప్రిన్సిపాల్ అపర్ణ, హెచ్‌ఎం సీతారాణి అభినందనలు తెలిపారు.

'మొక్కల సంరక్షణ ఎంతో అవసరం'

నక్కపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం తుని ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ దీప్తి పర్యవేక్షణలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పలు రకాల పూల మొక్కలు, ఔషధ గుణాలు మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో కె. తమ్మారావు, గ్రంథాలయాధికారి జనార్దన్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు గట్టెం నానాజీ పాల్గొన్నారు.

మన డబ్బులు.. మన లెక్కలపై డ్వాక్రా మహిళల ర్యాలీ

కోటవురట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములవాక గ్రామంలో మంగళవారం డ్వాక్రా మహిళలకు మన డబ్బులు.. మన లెక్కలపై అవగాహన కల్పించారు. డ్వాక్రా గ్రూపుల్లో జరుగుతున్న లావాదేవిల్లో అక్రమాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ విధానాన్ని కొత్తగా అమల్లోకి తీసుకువచ్చినట్టు మండల వెలుగు సీసీ వల్లీ అన్నారు. తీసుకున్న రుణాలు చెల్లించిన వాయిదాలు పొదుపు తదితర వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు.



కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మాజీ మంత్రి దాడి

యువత, మహిళలకు టీడీపీ ప్రాధాన్యం

▸▸ మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

అనకాపల్లి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఏ కమిటీని నియమించినా యువతకు, మహిళలకు ప్రాధాన్యతనిస్తున్నదని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు పేర్కొన్నారు. జీవీఎంసీ పరిధిలోని 80వ వార్డు నుంచి 84వ వార్డుల్లో నూతనంగా ఎన్నికైన కమిటీల సభ్యులతో మంగళవారం పట్టణం లోని సత్యాలక్ష్మీ గ్రాండ్ హాలులో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికే పదవులు వరిస్తాయన్నారు. తెలుగుదేశం పార్టీ ఒక విద్యాలయం లాంటిదని, నాయకులను తయారు చేయడంలో ఈ విద్యాలయం పనిచేస్తుందని చెప్పారు. ఈ విద్యాలయంలో ఎంతోమంది నాయకులుగా ఎదిగారన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులంతా పార్టీ బలోపేతానికి పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, 84వ వార్డు ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



అన్న సమారాధనను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్సీ బుద్ద... (ఇన్‌సెట్‌లో) పూల అలంకరణలో భక్తాంజనేయస్వామి

అనకాపల్లి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గవరపాలెం పరమేశ్వరిపార్కు జంక్షన్‌లోని భక్తాంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాసం మూడో మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో స్వామివారిని పూలతో అలంకరించారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు పొలిమేర నాయుడు బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను నాగజగదీశ్వరరావు ప్రారంభించారు. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు ఆలయంలో ఏకాహం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అసౌకర్యం తలెత్తకుండా నిర్వాహకులు చర్యలు చేపట్టారు.

రోడ్డుపై వాహనాలు పెడితే చర్యలు తప్పవు

▸▸ జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి



వాహనదారులతో మాట్లాడుతున్న జడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రహదారిలో ఎక్కడబడితే అక్కడ వాహనాలు నిలిపివేసి ఉంచితే చర్యలు తప్పవని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి హెచ్చరించారు. మంగళవారం ఆయన పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. సబ్బవరం రోడ్డు, విశాఖపట్నం రోడ్డు, రింగురోడ్లలో వాహనాలు పై వదిలి మరమ్మతులు చేయడాన్ని పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై వాహనాలు పెడితే ప్రయాణికులు ఇబ్బందులు పడతారని, ఇకపై అలా చేస్తే చర్యలు తప్పవని జడ్సీ హెచ్చరించారు. అనంతరం మెయిన్ రోడ్డులో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. కాలువలను శుభ్రం చేయాలని, ఎక్కడబడితే అక్కడ చెత్త ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగించి పరిశుభ్రతకు సహకరించాలని ఆయన సూచించారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



డైట్ కళాశాలలో ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు చోట్ల జాతీయ విద్యా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. డైట్ కళాశాలలో భారత తొలి విద్యా శాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌డాక్టర్ గణేష్‌ప్రసాద్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్య ప్రాముఖ్యతపై ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు జిల్లా ట్రెజరీ అధికారిణి వి.లక్ష్మీసుభాషిణి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలందరికీ సొంతిల్లు సమకూరుస్తాం

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు



మాట్లాడుతున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు

అనకాపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత నేత ఎన్టీ రామారావు ప్రతీ పేదోడికి సొంత ఇల్లు ఉండాలనే ఆశయానికి అనుగుణంగా కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు సొంత ఇల్లు సమకూర్చేందుకు కృషి చేస్తున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ అధ్యక్షుడు జిల్లా బత్తుల తాతయ్యబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 2029 నాటికి ప్రతీ పేదవాడికి సొంత ఇల్లు ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గడిచిన 16 నెలల్లో రాష్ట్రంలో పీఎంఏవై కింద 2,13,180 గృహాలు, పీఎంఏవై (జి) పథకం కింద 66,397 గృహాలు, పీఎంజేఎం కింద 5,980 గృహాలు కలిపి మొత్తం 2,85,557 గృహాలు పేదల కోసం నిర్మించామని చెప్పారు. ఇప్పటికే వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడం ద్వారా 3 లక్షల గృహాలను పేదలకు అందించనున్నామని తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇళ్ల నిర్మాణంలో జాప్యం లేకుండా 3 లక్షల ఇళ్లను పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలు చేయిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. నాడు పేదల ఇళ్ల నిర్మాణాల కోసం అన్న ఎన్టీఆర్ పరితపించారని, సీఎంగా చంద్రబాబునాయుడు అన్న ఆశయాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణాలతో పాటు రోడ్లు, నీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి అన్ని మౌలిక సదుపాయాలు ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం హయాంలో పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెడు సెంట్లు ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని వారికి కూడా ప్రభుత్వం సాయం చేయనుందని తెలిపారు. 2029 నాటికి ప్రతీ అర్హుడికి పక్కా ఇల్లు ఇవ్వడంప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం హయాంలో సెంటు పట్టా పేరుతో జగన్‌రెడ్డి దోపిడీ పర్వం సాగించారని ఆరోపించారు. పేదల ఇళ్ల నిర్మాణాల పేరుతో ఇసుక, సిమెంట్ కొనుగోళ్ల ముసుగులో ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆయన విమర్శించారు.

పారిశ్రామికవేత్తలను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

ఎంఎస్ఎంఈ యూనిట్ల శంకుస్థాపనలో ఎమ్మెల్యే పంచకర్ల



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పరవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) నెలకొల్పి ఇంటికొకరిని పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు స్పష్టం చేశారు. పరవాడ రెవెన్యూ పరిధిలోని ఏపీఐఐసీకి చెందిన ఫేజ్-2 స్థలంలో పరిశ్రమలు-ఉపాధి కల్పన కార్యక్రమంలో భాగంగా ఎంఎస్ఎంఈ యూనిట్ల ఏర్పాటుకు మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతకు ఎంఎస్ఎంఈ ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఇక్కడ 50 ఎకరాల్లో 99 చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పరిశ్రమ స్థాపనకు కేంద్ర ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందన్నారు. ఒక్కొక్కరికి 300 గజాల నుంచి 1500 గజాల వరకు స్థలాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డిప్యూటీ జడ్ఎం ఎం.సూర్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి సరోజిని, తహశీల్దార్ నాగరాజు, సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మానవరపు అప్పలనాయుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, కూటమి నాయకులు బొద్దపు శ్రీనివాసరావు, పైలా రామచంద్రరావు, వియ్యపు చిన్న, గొర్లి రామునాయుడు, బుగిడి రామగోవిందరావు, నగిరెడ్డి చిన్న, వెలుగుల అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థకు పునాది వేసిన మహనీయుడు ఆజాద్

▸▸ జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు



ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీఆర్వో

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారత విద్యా వ్యవస్థకు పునాది వేసిన మహానుభావుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి డీఆర్వో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, ఉర్దూ సాహిత్య ప్రఖ్యాతి పుంజం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినం సందర్భంగా నవంబరు 11న జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఆయన విద్యావేత్తగా, జాతీయ సమైక్యతకు ప్రతీకగా, భారత విద్యా వ్యవస్థకు పునాదులు వేసిన మహానుభావుడు అని డీఆర్‌వో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ కార్య నిర్వాహక సంచాలకులు షంసున్నీ సా బేగం, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ హాస్టల్ ఏర్పాటుకు కృషి

▸▸ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పూజారి శైలజ



క్రీడాభివృద్ధి అధికారి శైలజను సత్కరించిన జార్జిక్లబ్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో స్పోర్ట్స్ హాస్టల్ ఏర్పాటుకు కృషి చేస్తానని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పూజారి శైలజ చెప్పారు. మంగళవారం ఆమె జార్జి క్లబ్‌లో పలు క్రీడా మైదానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో క్రీడాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, జార్జి క్లబ్ ఆవరణలో క్రీడా పోటీలు నిర్వహిస్తే తమ సహకారం ఉంటుందన్నారు. ప్రతి మండలంలో క్రీడా మైదానం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు, , కార్యదర్శి బుద్ద కాశీవిశ్వేశ్వరరావు, జాతీయ వెయిట్ లిఫ్టర్ ఎంఎన్ఎస్ అప్పారావు ఆమెనుసత్కరించారు. విల్లూరి చంద్రశేఖర్, కాండ్రేగుల విష్ణుమూర్తి, పి.వీరభద్రరావు, పెంటకోట సుబ్రహ్మణ్యం, రాపేటి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణాలకు రూ.130 కోట్లు మంజూరు

▸▸ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల నిర్మాణం కోసం రూ.130 కోట్లు నిధులు మంజూరు చేసినట్టు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. మండలంలోని జెడ్.గంగవరం గ్రామంలో రూ.45 లక్షలతో నిర్మించనున్న రహదారి నిర్మాణానికి మంగళశారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ గతంలో అధిక లోడుతో లారీలు తిరగడం వల్ల ఈ రోడ్డు పూర్తిగా పోయిందన్నారు. అందుకే నాబార్డు నిధులు రూ.45 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నట్టు తెలిపారు. తాళ్లపాలెం నుంచి జెడ్.గంగవరం రోడ్డు నిర్మాణ పనులు కూడా చేపడుతున్నట్టు ఆయన చెప్పారు. సుమారు 1.6 కిలోమీటర్లు పొడవునా రోడ్డు నిర్మాణంతో పాటు ఒక శ్లాబ్ కల్వర్టును కూడా నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల జెడ్.గంగవరం, దుంగలవానిపాలెం గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వీవీ.రమణ, ప్రాజెక్టు డీఈ ఆర్‌సత్యనారాయణ, ఎంపీడీవో చాయి సుధ, తహశీల్దార్ వెంకటరమణ, తామరం పీఏసీఎస్ అధ్యక్షుడు శీరరెడ్డి చినబాబు, నర్సీపట్నం ఏఎంసీ చైర్మెన్ గవిరెడ్డి రమణ, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు, శెట్టిపాలెం, జడ్.గంగవరం సర్పంచులు ఎ.రామూనాయుడు, డి.రమణ పాల్గొన్నారు.

మహిళా స్వావలంబన అభినందనీయం

మాకవరపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించడం అభినందనీయమని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మార్ట్ ద్వారా సోమవారం సంఘాలకు రూ.14.32 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 14,320 సభ్యులకు ఒకొక్కరికి రూ.100 చొప్పున మొత్తం 14.32 లక్షల చెక్కును అందించినట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించు కోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సచిదేవి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



నిరుపయోగంగా ఉన్న పరవాడ సచివాలయం-1 భవనం

అక్కరకు రాని సచివాలయ భవనం

పరవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ పరవాడ సంతబయలు వద్ద నూతనంగా నిర్మించిన సచివాలయం-1 భవనం నిరుపయోగంగా దర్శనమిస్తున్నది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.35 లక్షల వ్యయంతో దీని నిర్మాణం చేపట్టారు. భవనం పనులు పూర్తిచేసి 2024 సార్వత్రిక ఎన్నికలకు కొద్ది రోజులు ముందు అప్పటి ప్రజా ప్రతినిధులు హడావుడిగా ప్రారంభించారు. సుమారు 19 నెలలుగా భవనం మూతపడి ఉంది. దీంతో ఇప్పటికీ పంచాయతీ భవనంలోనే సచివాలయం సేవలను అందిస్తున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాన్ని నిరూపంగా విడిచిపెట్టడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

అనకాపల్లి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం కూడా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను తొలగించే పనులు చేపట్టారు. అనుమతులు లేని భవనాలను తొలగిస్తున్నామని టీపీవో వరప్రసాద్ తెలిపారు. గవరపాలెం సంతబయలు జంక్షన్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన షెడ్డును, పెంట్‌హౌస్‌ను, పూల్‌బాగ్‌రోడ్డులో మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా ఉన్న భవనాన్ని తొలగించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అనుమతులు లేని భవనాలను తొలగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఎరువులు ఇచ్చి రైతులను ఆదుకోండి

▸▸ సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

అనకాపల్లి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన ఎరువులను సరఫరా చేసి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు కోరారు. తుఫాన్ ప్రభావం వల్ల జిల్లాలో రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి పొలాలు నీట మునిగి నష్టాల నుంచి కోలుకోకముందే రైతులకు అవసరమైన ఎరువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఎరువులు అందుబాటులో ఉంచకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

కుక్కదాడిలో నలుగురికి గాయాలు

పరవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్క దాడి చేయడంతో నలుగురు గాయపడ్డారు. మండల కేంద్రం పరవాడ గండివారివీధిలో మంగళవారం సాయంత్రం ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పరవాడకు చెందిన పైలా దుర్గా, దీపిక, జి.గంగేంద్ర, బి.మోక్ష నడిచి వెళ్తుండగా వీధి కుక్క ఒకరి తరువాత ఒకరిపై దాడి చేసి గాయపరిచింది. స్థానికులు కేకలు వేయడంతో అక్కడి నుంచి కుక్క పారిపోయింది. క్షతగాత్రులను కుటుంబ సభ్యులు పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయించారు.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న స్వామివారు

లంకెలపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): లంకెలపాలెం మారుతి కూడలిలో అభయాంజనేయస్వామి ఆలయ 12వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారిని పుష్పాలు, నూతన వస్త్రాలతో అలంకరించి పూజలు జరిపారు. అలాగే గణపతి పూజ, పుణ్యాహావచనం, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం తదితర పూజలను నిర్వహించారు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. భక్తులకు నిర్వాహకులు ప్రసాదాలను పంపిణీ చేశారు. మరో నాలుగు రోజులు పాటు వేడుకలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు వాసు, పి.రమణమూర్తి, మడక రమేశ్‌నాయుడు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించండి



శిబిరంలో మాట్లాడుతున్న ప్రకాశ్

అనకాపల్లి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ ప్రకాశ్ సూచించారు. మండలంలోని రైతు సాధికార సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో కొత్తగా ఎన్నికైన ఐసీఆర్‌పీలకు మంగళవారం రెండో రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలను, రసాయనిక పురుగుల మందుల వాడటం వల్ల నష్టాలను ఆయన వివరించారు. ప్రతి గ్రామంలోనూ ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో 110 మంది ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

అమ్మో.. వై జంక్షన్

ప్రమాదకరంగా ప్రధాన కూడలి.. ప్రయాణికుల ఆందోళన

కానరాని హెచ్చరిక బోర్డులు.. ఏర్పాటు చేయాలని విన్నపాలు



మండల పరిషత్ కార్యాలయం సమీపంలో గల వై జంక్షన్

పరవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని 'వై' జంక్షన్ ప్రయాణికుల గుండెల్లో టెన్షన్ సృష్టిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ జంక్షన్‌లో ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. పరవాడ నుంచి గాజువాక వైపు వెళ్లే వాహనాలు జంక్షన్ వద్దకు వచ్చేసరికి నేరుగా లంకెలపాలెం వైపు తిరుగుతాయా? లేకుంటే గాజువాక వైపు వెళ్తాయో? అర్థం కాని పరిస్థితి. అలాగే గాజువాక నుంచి వచ్చే వాహనాలు లంకెలపాలెం వైపు వెళ్తాయో లేక పరవాడ ఊరులోకి వస్తాయో అన్న గందరగోళం నెలకొంటుంది. జంక్షన్ వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనికితోడు లంకెలపాలెం నుంచి భారీ వాహనాలు అతి వేగంగా వచ్చే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో లంకెలపాలెం నుంచి వచ్చే రహదారి వద్ద స్పీడు బ్రేకర్లు ఉండేవి. ఇటీవల రహదారి విస్తరణలో భాగంగా వాటిని తొలగించడంతో పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. నిత్యం రద్దీగా ఉండే ఈ జంక్షన్‌లో హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే బొగ్గు లారీలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుండడంతో జంక్షన్ వద్ద ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. లంకెలపాలెం వైపు నుంచి వచ్చే బొగ్గు లారీలు ఒకొక్కసారి సడన్‌గా పరవాడ వైపు మలుపు తిరగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నిజానికి అవి గాజువాక వైపు వెళ్లే రహదారి మీదుగా పోవాలి. అయితే డ్రైవర్లు అప్పుడప్పుడు పరవాడ వైపు తిప్పడంతో, ఆ సమయంలో అటుగా వచ్చే వాహనదారులు కంగారు పడాల్సి వస్తోంది.

రాత్రుల సమయంలో మరీ దారుణం

రాత్రుల సమయంలో జంక్షన్ వద్ద పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. ఎటువైపు వాహనాలు వెళ్తాయో తెలియక గందరగోళం నెలకొంటుంది. దీంతో ఆ సమయంలో అటుగా రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జంక్షన్ సమీపంలో మూడు వైపులా స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు పెట్టినట్లయితే కొంతమేర ప్రమాదాలను అరికట్టవచ్చని ప్రయాణికులు అంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ జంక్షన్‌లో ఇప్పటి వరకు ఆర్‌అండ్‌బీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు మండిపడుతున్నారు. ప్రమాదాల నివారణకు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



షేక్ బాషా, గొల్లగుంట గ్రామం, రావాడ పంచాయతీ

వై జంక్షన్ వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి. లేకుంటే తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ప్రాణ నష్టం వాటిల్లలేదు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొండపైకి వెళ్తేనే మొబైల్ ఫోన్ సిగ్నల్స్

» సంక్షేమ పథకాల ఆన్‌లైన్‌కు గసబ పంచాయతీ పరిధిలోని గిరిజనులకు అవస్థలు



ఆరోగ్య శ్రీ ఆన్‌లైన్ కోసం మొర్రిగుడ కొండపై నిరీక్షిస్తున్న గిరిజనులు

అరకులోయ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):డుంబ్రిగుడ మండలం గసబ పంచాయతీ పరిధిలో ఏడాది క్రితం బీఎస్‌ఎన్‌ఎల్‌కు సంబంధించి నాలుగు సెల్‌టవర్లు ఏర్పాటుచేశారు. కానీ, ఒక్క టవర్‌నుంచి సిగ్నల్స్ వచ్చిన దాఖాలాలు లేవు. దీంతో పంచాయతీ ప్రజలు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఆన్‌లైన్ పనులకు సమీప కొండలు, గుట్టలపైకి సిగ్నల్స్ కోసం వెళ్లాల్సి వస్తోందని సచివాలయ, వైద్య శాఖ ఆరోగ్యకార్యకర్తలు వాపోతున్నారు. మంగళవారం ఈ పంచాయతీ పరిధిలోని మొర్రిగుడ, గాదు, సిమిలిగుడ, కుమిడికుట్టి తదితర గ్రామాల ప్రజలు మొర్రిగుడ కొండ గట్టుకు తీసుకువచ్చి ఆన్‌లైన్‌లో వేలిముద్రలు సేకరించారు. దీంతో సమారు ఆరు గ్రామాల్లో ఇబ్బంది ఎదుర్కొన్నారు. వృద్ధులు, మహిళలు ఉదయం 8 గంటల నుంచి సిగ్నల్ వచ్చే పాయింట్ వద్దకు ఏఎన్‌ఎం వచ్చి ఆరోగ్యశ్రీ కార్డులకు సంబంధించి ఆన్‌లైన్ చేపట్టారు. ఇదే మొర్రిగుడ గుట్టలో మరోచోట మరి కొందరు రేషన్‌కార్డుల్లో మార్పుల్లో గ్రామ సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులు బిజీగా కనిపించారు. పంచాయతీలోని బల్యాగుడ కొండ ఎక్కితేనే సెల్ సిగ్నల్స్ వస్తున్నాయి. దీంతో బల్యాగుడ, కూడ, జోడిగెడ్డ, గరడల, కుసుమకింద గ్రామాలవారంతా ఆన్‌లైన్ కోసం ఈ కొండపైకి వెళ్లారు. నాలుగు చోట్ల ఏర్పాటు చేసిన బీఎస్‌ఎన్‌ఎల్ సెల్‌టవర్స్ సద్వినియోగం కాకపోవడంపై గిరిజనులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలి

» కలెక్టర్ దినేశ్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన ఏయూ వీసీ రాజశేఖర్

పాడేరురూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ సూచించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేపడుతున్న గ్రామీణ అనుసంధానం కార్యక్రమాన్ని మంగళవారం పాడేరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఏయూవీసీ ఆచార్య జీపీ రాజశేఖర్, కలెక్టర్ జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యంగా చేసుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ప్రశ్నించే తత్వాన్ని అలవరుచుకోవాలన్నారు. మాతృభాషతోపాటుఆంగ్లంపై పట్టు సాధించాలని సూచించారు. ప్రభుత్వాలు అందిస్తున్న స్కాలర్‌షిప్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.గిరిజాశంకర్, డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి, ఏయూ సీడీసీ డీన్ ఆచార్య టి.వెంకటకృష్ణ పలు సూచనలు అందించారు.

కాఫీ కార్మికుల సమ్మె ఉధృతం: సీఐటీయూ



చింతపల్లిలో ఆందోళన చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నేతలు

చింతపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీఎఫ్‌డీసీ కాఫీ తోటల్లో పనిచేస్తున్న కార్మికుల సమ్మెను ఉధృతం చేస్తున్నట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. మంగళవారం కాఫీ కార్మికులు మండల కేంద్రంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయ మాట్లాడుతూ సోమవారం ఏపీఎఫ్‌డీసీ అధికారులతో జరిగిన చర్చల్లో కార్మికులకు స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. దీంతో సమ్మెను కొనసాగిస్తున్నట్టు ప్రకటించారన్నారు. అయితే, సాయంత్రం ఏపీఎఫ్‌డీసీ పాడేరు డివిజనల్ మేనేజర్ కాఫీ కార్మికులకు దినసరి కూలి, పండ్ల సేకరణ ధర పెంచుతున్నామని, కార్మికుల సమస్యలు పరిష్కారానికి అంగీకారం తెలిపినట్టు ప్రకటన జారీచేశారన్నారు. ఈ ప్రకటన వాస్తవంకాదని అన్నారు. సమస్యలపై లిఖిత పూర్వక హామీ ఇచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ఈకార్యక్రమంలో కాఫీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రాజు, మోరి వెంకటగిరి, కనకవల్లి, రాజారావు, పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణకు ప్రచారం

కొయ్యూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సనాతన ధర్మాన్ని పరిరక్షించాలని వారాహి పీఠాధిపతి అరుణానంద స్వామిజీ పిలుపునిచ్చారు. ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డీవీడీ ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలో గడప గడపకు ధర్మ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ సంస్కృతి సనాతన ధర్మాలను వివరించారు. అనంతరం గణపతి మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం లేక ఇక్కట్లు



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

పాడేరురూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం డివిజన్, గాలిపాడు పంచాయతీ బూరుగుపాలెం నుంచి ఏడు గ్రామాలను కలుపుతూ రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రహదారి సౌకర్యం లేక 7 గ్రామాల ప్రజలు విద్య, వైద్యంకు ఇబ్బందికి గురవుతున్నారన్నారు. తంగేడుకోటలో అంగన్వాడీ కార్యకర్తను నియమించాలని, కొయ్యూరు మండలం మఠం భీమవరం అంగన్‌వాడీ కేంద్రానికి మారేడుమిల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు నుంచి పోషకాహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జె.కుమార్, సింహాచలం, దినేష్‌రెడ్డి, కె.లింగారెడ్డి, బి.రాజారెడ్డి, పి.పండురెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

డుంబ్రిగుడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు గంజాయి సాగు, రవాణా, విక్రయం తదితర కార్యకలపాలకు దూరంగా ఉండేలా చూడాలని ఐసీడీఎస్ సీడీపీ రాణి, పోలీసులు సూచించారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగహన కార్యక్రమం నిర్వహించారు. పోలీసు సిబ్బంది, హెచ్‌సీ ధర్మ పాల్గొన్నారు.

ధారకొండను మండల కేంద్రంగా చేయాలని వినతి



మంత్రి సంధ్యారాణికు వినతిపత్రంను అందజేస్తున్న మండల సాధన కమిటీ సభ్యులు

సీలేరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ధారకొండను మండల కేంద్రంగా ఏర్పాటు కోసం సహకరించాలని కోరుతూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి మండల సాధన కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం సాలూరులో ఆమెను వారు కలసి వెనుకబడిన ధారకొండ ప్రాంతాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే అభివృద్ధికి వీలవుతుందని వివరించారు. సీలేరు, దుప్పులవాడ, గుమ్మిరేవుల, గాలికొండ పంచాతీల పరిధిలోని 150కి పైగా గ్రామాలకు ధారకొండ ఎంతో అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి, న్యాయం చేసే దిశగా కృషి చేయాలంటూ మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సాధన కమిటీఅధ్యక్షుడు శోభ జగన్, సీలేరు సర్పంచ్ పి దుర్గో, కిల్లో ధర్మారావు, పొత్తూరు రాంబాబు, బైశెట్టి సుందరరావు, నడిగట్ల బాబి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై వైద్య సిబ్బందికీ అవగాహన అవసరం

హుకుంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):ఆరోగ్యశాఖ సిబ్బంది వ్యాధులపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రిన్సిపాల్ ఇనిస్టిగేటర్ డాక్టర్ వైఎస్ కుసుమ అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (న్యూఢిల్లీ ఇండియన్ కౌన్సిల్ మెడికల్ రీసెర్చ్) వారి ప్రోత్సాహంతో వైద్య సిబ్బందికు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజలు లోనయ్యే వివిధ వ్యాధులు, జాగ్రత్తలు, గర్భధారణ, ప్రసవాలు, నవజాత, చిన్నారుల ఆర్యోగ్య సంరక్షణ సేవలను వివరించారు. బాలబాలికలకు ఆరోగ్య సేవలు, క్షయ, లెప్రసీ వ్యాధులు, మలేరియా, డెంగ్యూ జ్వరాలు, బీపీ, షుగర్ క్యాన్సర్, మానసిక వ్యాధులపై కౌన్సెలింగ్ తదితర అంశాలను వైద్య సిబ్బంది తెలుసుకోవాలన్నారు. నాటు వైద్యానికి గిరిజనులు దూరంగా ఉండేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సౌజన్య, రేఖ హెల్త్ సూపర్‌వైజర్ మురళీ , సాంబశివరావు పాల్గొన్నారు.

గిరిజన కుటుంబాలకు ఉపాధి కల్పించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు

పాడేరురూరల్/ అనంతగిరి నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనంతగిరి మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం భీసుపురం ఏపీఎఫ్‌డీసీ కాఫీతోటల వద్ద ఉడెన్‌బ్రిడ్జీతో పాటుగా వ్యూపాయింట్ నిర్మించి గిరిజనులకు ఉపాధి చూపాలని కలెక్టర్ దినేశ్ కుమార్‌ను జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రమందించారు. 2006 నుంచి కాఫీ పౌడర్, ఇతర అటవీ ఉత్పత్తులను అమ్మకాలు సాగిస్తూ 112 మంది గిరిజనులు స్వయం ఉపాధిపొందుతున్నారని, అయితే, సుంకరమెట్ట కాఫీతోటల వద్ద ఉడెన్‌బ్రిడ్జీ నిర్మాణంతో భీసుపురం కాఫీతోటల వద్ద ఆగేందుకు పర్యాటకులు ఆసక్తిచూపటం లేదన్నారు. దీనినే నమ్ముకుని జీవిస్తున్న గిరిజనులకు న్యాయం చేసేవిధంగా ఏపీఎఫ్‌డీసీ అధికారులకు ఆదేశించి, భీసుపురం కాఫీతోటల వద్ద అభివృద్ధిచేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. పీహెచ్‌సీలో అంబులెన్స్ డ్రైవర్లకు జీతాలు పెంచి, ఐటీడీఏలో కలపాలని కోరారు.

రహదారి నిర్మించాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న గొడుగురాయి గ్రామస్థులు

జి.మాడుగుల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గెమ్మెలి పంచాయతీ గొడుగురాయి గ్రామంలో రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామస్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మనపడాల్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో రూ. 49తో రహదారిని మంజూరు చేశారు. అయితే అరకొరగా గ్రావెల్ రోడ్డు పనులు చేపట్టి కాంట్రాక్టర్ నిధులు కాజేశారని ఆరోపించారు. గొడుగురాయిని రెవెన్యూ గ్రామంగా గుర్తించి పోడు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. స్థానిక గిరిజనులు పాల్గొన్నారు.

ఘనంగా బిర్సా ముండా జయంతి



శోభాయాత్ర నిర్వహిస్తున్న ఏబీవీపీ నేతలు

పాడేరురూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ పోరాటయోధుడు బిర్సా ముండా 150వ జయంతిని పాడేరులో గిరిజన సంఘం, ఏబీవీపీ సంఘ నాయకులు వేర్వేరుగా మంగళవారం నిర్వహించారు. గిరిజన సంఘం కార్యాలయంలో గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స, జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దుబాలదేవ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్.ధర్మానపడాల్, పి.లక్కు, కె.నర్సయ్య, టి.కృష్ణారావు, ఎంఎం.శ్రీను, దాసు, సూర్యనారాయణ, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో బిర్సా ముండా చిత్రపటానికి ఏబీవీ నాయకులు నివాళులర్పించారు. అనంతరం ఏబీవీపీ రాష్ట్ర సహా సంఘటన కార్యదర్శి సుబ్బరాజు మాట్లాడుతూ, గిరిజన సాంస్కృతి, హక్కుల పరిరక్షణ కోసం ఆంగ్లేయులతో పోరాడిన బిర్సా ముండా గిరిజన యువతకు ఆదర్శం అన్నారు. సమావేశం అనంతరం అంబేడ్కర్ కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు శోభాయాత్రను చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ.ఆనంద్, ఎంఎంఎల్.పాత్రుడు, ఎం.శ్రీనివాస్ పాత్రుడు, టి.యోగి, శెట్టి ప్రీతి, కృష్ణ పాల్గొన్నారు.

పెదజాగేరులో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ఎదజాగేరులో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నేతలు

జి.మాడుగుల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరాపల్లి పంచాయతీ పెదజాగేరులో మంగళవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్టు సర్పంచ్ ఎం.రాజులమ్మ తెలిపారు. ఉపాధి నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో నాయకులు పెదబాలన్న, కూటమి నాయకులు శ్రీనివాసనాయుడు, కె.చిట్టి నాయుడు, పెద్దబ్బాయి, కొండబాబు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

చెక్కరాయి బందలో..

చింతపల్లి: మండలంలోని లంబసింగి పంచాయతీ చెక్కరాయిబంద గ్రామానికి రూ.1.9కోట్ల పీఎం జన్‌మన్ పథకం నిధులతో తారు రోడ్డు నిర్మిస్తున్నట్లు ఐటీడీపీ మండల ఇన్‌చార్జి వరకోటి మహేంద్రబాబు అన్నారు. మంగళవారం ఈ నిర్మాణానికి సర్పంచ్ శాంతి కుమారితో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతి గిరిజన గ్రామానికి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తుందన్నారు. టీడీపీ నాయకులు కిముడు లక్ష్మయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

కొయ్యూరు, నవంబరు 11 (ఆంధ్రజోతి): మండలంలోని బకులూరులో ఇటీవల విద్యుత్ సర్క్యూట్‌కు ఇల్లు దగ్ధమైన బాధిత కుటుంబానికి స్థానిక జనసేన నాయకులు మంగళవారం నిత్యావసరాలు, నగదు, వస్త్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ.. జనసేన అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి, జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ ఛైర్మన్ వి.గంగులయ్య సూచనలపై ఈ సహాయం చేసినట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంప్రసాద్, గోవింద్, బద్రి, చిన్నబ్బాయి, గద్దర్, వీరస్వామి, నాగేశ్వరరావు, మల్లేశ్, రాజాబాబు, స్వామినాయుడు, తలుపులమ్మ, భీమరాజు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో చర్మ వ్యాధులు దూరం



విద్యార్థులకు దురదల నివారణ మందు రాస్తున్న వైద్య సిబ్బంది

పాడేరురూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాల వసతి గృహాల్లోని విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీహెచ్‌వో ప్రభాకర్, హెచ్‌వీ వరలక్ష్మి కోరారు. మండలంలోని మినుములూరు పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిశ్రీ ఆదేశాల మేరకు చింతలవీధి ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో తలారిసింగి బాలుర ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గజ్జి, దురద తదితర చర్మ వ్యాధులతో బాధపడుతున్న విద్యార్థులకు బెంజల్ బెంజట్ సొల్యూషన్ రాశారు. ఈ విధంగా మూడు రోజులు చేస్తే గజ్జి, దురదలు తగ్గిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు ఎస్.సుశీల, కుమారి, సంధ్య, హెల్త్ అసిస్టెంట్ వెట్టి నాగరాజు, ఆశా, సీహెచ్‌డబ్ల్యూ పాల్గొన్నారు.

నిజాయితీగా ఉన్న నేతలకు గుర్తింపు: ఎమ్మెల్యే మత్స్యలింగం



మాట్లాడుతున్న మత్స్యలింగం

డుంబ్రిగుడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిజాయితీగా ఉన్న నేతలకు గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే మత్స్యలింగం అన్నారు. స్థానిక కిడారి సామాజిక భవన ప్రాంగణంలో పోతంగి పంచాయతీ వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు మఠం శంకర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ముందుగా బాలికలు, బాలురు గిరిజన ఆశ్రమ పాఠశాలలను సందర్శించిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేత చాణక్య, సర్పంచ్ వెంకటరావు, వైస్ ఎంపీపీ ఆనంద్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీరాములు, సింహాచలం, చిరంజీవి, అశోక్, జగ్గనాయుడు పాల్గొన్నారు.

జీకేవీధి సీఐగా సుధాకర్



గూడెంకొత్తవీధి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బొడ్డేపల్లి సుధాకర్ నియమితులయ్యారు. ఏడాదిన్నకాలంగా ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ వర ప్రసాద్ విశాఖపట్నం జిల్లాకు నెల రోజుల క్రితం బదిలీ అయ్యారు. ప్రస్తుతం సీఐ పోస్టు ఖాళీగావున్నది. ఈమేరకు విజయనగరం డీసీఆర్‌బీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సుధాకర్‌ని జీకేవీధికి బదిలీ చేస్తూ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం విధుల్లో చేరారు.

15, 16 తేదీల్లో గ్రామీణ విలేకరులకు పునశ్చరణ తరగతులు

చింతపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో గ్రామీణ విలేకరులకు ఈనెల 15, 16తేదీల్లో పునశ్చరణ తరగతులు నిర్వహించనున్నట్టు స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి తెలిపారు. రెండు రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఈ తరగతులకు జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న విలేకరులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డ్రగ్స్‌తో భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు: సీఐ



ప్ల కార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులతో సీఐ, ప్రిన్సిపాల్

అరకులోయ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని ఈగల్ సీఐ రమేశ్‌రుద్ర పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు ఆధ్వర్యంలో డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల ప్లకార్డులతో గంజాయి, డ్రగ్స్ రహిత ప్రాంతంగా ఏజెన్సీని మార్చాలని నినాదాలుచేశారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌తో వచ్చే నష్టాలను విద్యార్థులు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి సాగు, రవాణాపై ఈగల్‌టోల్‌ఫ్రీ నంబర్ 1972ను తెలియజేయాలని కోరారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. జిల్లా ఎస్‌డీపీఎస్ సీఐ రవికుమార్ మాదకద్రవ్యాల నిరోధక చట్టాలు, శిక్షలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ అధికారుల వన సమారాధన



ఎకో టూరిజం ప్రాజెక్టు వద్ద వనసమారాధనకు హాజరైన అధికారులు

చింతపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర కశ్మీర్‌కి సమీపంలోనున్న కృష్ణాపురంలో అటవీశాఖ ఏర్పాటు చేసిన ఎకో టూరిజం ప్రాజెక్టులో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు వన సమారాధన నిర్వహించారు. ఎకో టూరిజం ప్రాజెక్టులో పర్యాటకులకు అటవీశాఖ ఓపెన్ గార్డెన్ అద్దెకు ఇస్తోంది. ఈ మైదానంలో మంగళవారం పశుసంవర్ధకశాఖ అధికారులు వన సమారాధన జరిపారు. ఈ కార్యక్ర మంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వి.జయరాజ్, ఏడీఏ డాక్టర్ పి.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

107 మందికి నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యనిపుణురాలు అనూష

చింతపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన మెగా కంటి వైద్యశిబిరంలో 107మంది బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్టు జిల్లా ఆస్పత్రుల సేవలు సమన్వయకర్త (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ ఎం. నీలవేణి అన్నారు. మంగళవారం జిల్లా కంటి అంధత్వ నియంత్రణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ టి. విశ్వేశ్వరనాయుడు పర్యవేక్షణలో ఏరియా ఆస్ప త్రిలో నేత్ర వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. చింతపల్లి, జీకేవీధి మండలాల నుంచి హాజరైన ఆదివాసీ బాధితులకు ఏరియా ఆస్పత్రినేత్ర వైద్యనిపుణులు డప్పోడి అనూష పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా డీసీహెచ్‌ఎస్ మాట్లాడుతూ, ఈ శిబిరంలో 38మందికి కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశామన్నారు. వీరిని ప్రత్యేక వాహనంలో విశాఖ అనీల్ నీరుకొండ ఆస్పత్రి తరలించారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యనిపుణులు డప్పోడి అనూష, అప్తాలమిక్ అసిస్టెంట్ రమణబాబు పాల్గొన్నారు.

ఏపీటీడబ్ల్యూటీఏ సభ్యత్వ నమోదు



సభ్యత్వం తీసుకుంటున్న ఉపాధ్యాయులు

పాడేరురూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం (ఏపీటీడబ్ల్యూటీఏ) 2025-26 సంవత్సరానికి గాను ప్రతీ ఉపాధ్యాయుడు రూ. 200 చెల్లించి వార్షిక సభ్యత్వాన్ని పొందాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ కోరారు. పాడేరు తలారిసింగి పాఠశాలలో మంగళవారం ఆయన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, హెచ్‌ఎంల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జీవీవీ ప్రసాద్, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఎం.గంగాభవాని, టి.నాగేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, కె.రామారావు పాల్గొన్నారు.

గిరిజనులందరికీ పక్కా గృహాలు



మాట్లాడుతున్న టీడీపీ మండలాధ్యక్షుడు పూర్ణచంద్రరావు

చింతపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పక్కా గృహాల కోసం గిరిజనులంతా దరఖాస్తు చేసుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. మంగళవారం కొత్తపాలెం గ్రామ సచివాలయం-1లో హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులు ఆదివాసీలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీఎం జన్‌మన్ పథకం ద్వారా పీవీటీజీలకు పక్కా గృహాలను మంజూరు చేసిందన్నారు. ఇతర గిరిజన తెగల కుటుంబాలకు సైతం గృహాలు మంజూరుకు గ్రామీణ సర్వే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రమణబాబు, పంచాయతీ కార్యదర్శి ఎం.రాజుబాబు పాల్గొన్నారు.

'సమ్మేటివ్ పరీక్షలు వాయిదా వేయాలి'

పాడేరురూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీన నిర్వహించాల్సిన సమ్మేటివ్ పరీక్షలు వాయిదా వేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యుడు పల్లుల ప్రసాదరావు కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పుట్టిన రోజు కావడంతో ఈనెల 14న బాలల దినోత్సవాన్ని అన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఘనంగా చేపడుతుంటారు. ప్రభుత్వం ఇదే సమయంలో సమ్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షల టైం టేబుల్ విడుదల చేసిందన్నారు. పరీక్ష తేదీల్లో మార్పుచేయాలని ఆయన కోరారు.

అర్హులందరికీ ఓటు హక్కు: తహశీల్దార్

చింతపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పద్దెనిమిదేళ్లు కలిగిన ప్రతి ఒకరికీ ఓటు హక్కు కల్పించాలని స్థానిక తహశీల్దార్ కె. శంకరరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బూత్ స్థాయి అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఓటు హక్కు కల్పనకు అవకాశం కల్పించిందన్నారు.బూత్ స్థాయి అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఓటర్ల పేర్లు, చిరునామా మార్పులు చేర్పులకు అవకాశం ఉంటుందన్నారు. డీటీ బాలదొర, ఆర్‌ఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఇళ్ల బిల్లుల కోసం వినతి

జి.మాడుగుల, నవంబరు 11 (ఆంధ్రజోతి): పీఎం జన్‌మన్ గృహాల బిల్లులు విడుదల చేయాలని గిరిజన ఐక్యవేదిక మండల కమిటీ నాయకులు కె.వెంకటరమణ, కె.సాయిప్రవీణ్ కోరారు. ఈ మేరకు మంగళవారం వారు స్థానిక ఏఈకి వినతిపత్రం అందజేశారు. మండలంలో కొందరు ఇళ్లను పూర్తి చేసినా బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. పెంచిన రూ. లక్ష లబ్ధిదారులకు అందించాలన్నారు.

వాహన తనిఖీలు

ముంచంగిపుట్టు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక ఎస్‌ఐ జె.రామకృష్ణ ఆధ్వర్యంలో వాహన తనిఖీ చేపట్టారు. వాహనాలు నడిపే వ్యక్తులకు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని, రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.ఆటోలు, జీపుల్లో అధిక లోడ్‌లతో ప్రయాణిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు.

జీసీసీ పెట్రోలు బంకు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



జీసీసీ డీఎంకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాడేరురూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ మండలాల్లో జీసీసీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులలో పనిచేస్తున్న కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ నేత అమర్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జీసీసీ డీఎంకు వినతిపత్రం అందించారు. అనంతరం యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అమర్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు సత్యాంజనేయ మాట్లాడుతూ, జీసీసీ పెట్రోల్ బంకుల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కరించకపోవడం విచారకమన్నారు. కార్మికులకు కనీస వేతనాలు, గుర్తింపుకార్డులు జారీ, సెలవులు, పీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శివశంకర్, సోమేశ్వరరావు, మత్స్యరాజు, మోహన్ పాల్గొన్నారు.


మహిళలకు చెక్కులను అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మహిళా స్వావలంబన అభినందనీయం

ఎస్‌హెచ్‌జీలకు రూ.14.32 లక్షల పంపిణీ: స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించడం అభినందనీయమని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మార్ట్ ద్వారా సోమవారం సంఘాలకు రూ.14.32 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 14,320 సభ్యులకు ఒక్కొక్కరికి రూ.100 చొప్పున మొత్తం 14.32 లక్షల చెక్కును అందించినట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సచిదేవి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వేమాలమ్మ జాతర


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

నర్సీపట్నం అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపూడిలో మంగళవారం వేమాలమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాప దంపతులు, ధర్మసాగరం ఎంపీటీసీ సభ్యుడు బోళెం రామ్‌ప్రసాద్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో భాగంగా జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలను ఏర్పాటు చేసి, విజేతలకు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి విజయనగరం జిల్లా వాయుపాడు, రెండో బహుమతి పరవాడనాయుడు, మూడో బహుమతి పరదేశమ్మనాయుడు గెలుచుకున్నారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

వెదురుపల్లిలో రేట్లమ్మతల్లి పండుగ

నాతవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వెదురుపల్లి గ్రామంలో మంగళవారం రేట్లమ్మతల్లి పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు క్యూలో నిల్చొని అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ సర్పంచ్ పారుపల్లి వెంకటరమణ తదితరులు జాతర ఏర్పాట్లు చేశారు. సాయంత్రం అమ్మవారిని పురవీధులలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, తాండవ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కరక సత్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షులు సింగంపల్లి సన్యాసిదేముడు, అంకంరెడ్డి నానిబాబు, టీడీపీ నాయకులు సుర్ల వెంకటరమణ, చింతకాయల ప్రశాంత్, పోలుపర్తి సాయి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

తెగుళ్లపై రైతులు మేల్కోవాలి

నాతవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరి పంటకు తెగుళ్ల సోకిన వెంటనే రైతులు మేల్కోవాలని వ్యవసాధికారి సుగణ సూచించారు. చెర్లోపాలెం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటకు ఎక్కువగా ఆకుముడత, ఎర్ర తెగుళ్ల వస్తాయన్నారు. వీటి నివారణకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రోజారోహిణీ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలకు రూ.130 కోట్లు మంజూరు

▸▸ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు


రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల నిర్మాణం కోసం రూ.130 కోట్లు నిధులు మంజూరు చేసినట్టు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. మండలంలోని జెడ్.గంగవరం గ్రామంలో రూ.45 లక్షలతో నిర్మించనున్న రహదారి నిర్మాణానికి మంగళశారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ గతంలో అధిక లోడుతో లారీలు తిరగడం వల్ల ఈ రోడ్డు పూర్తిగా పోయిందన్నారు. అందుకే నాబార్డు నిధులు రూ.45 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నట్టు తెలిపారు. తాళ్లపాలెం నుంచి జెడ్.గంగవరం రోడ్డు నిర్మాణ పనులు కూడా చేపడుతున్నట్టు ఆయన చెప్పారు. సుమారు 1.6 కిలోమీటర్లు పొడవునా రోడ్డు నిర్మాణంతో పాటు ఒక శ్లాబ్ కల్వర్టును కూడా నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల జెడ్.గంగవరం, దుంగలవానిపాలెం గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వీవీ.రమణ, ప్రాజెక్టు డీఈ ఆర్‌సత్యనారాయణ, ఎంపీడీవో చాయిసుధ, తహశీల్దార్ వెంకటరమణ, తామరం పీఏసీఎస్ అధ్యక్షుడు శీరరెడ్డి చినబాబు, నర్సీపట్నం ఏఎంసీ ఛైర్మన్ గవిరెడ్డి రమణ, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు, శెట్టిపాలెం, జడ్.గంగవరం సర్పంచులు ఎ.రామూనాయుడు, డి.రమణ పాల్గొన్నారు.

సరుగుడు జలపాతం వద్ద పర్యాటకుల సందడి


సరుగుడు జలపాతంలో జలకాలాడుతున్న పర్యాటకులు

నాతవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సరుగుడు జలపాతం మంగళవారం పర్యాటకులతో కిటకిటలాడింది. కార్తీకమాసం కావడంతో విశాఖపట్నం, అనకాపల్లి తదితర దూర ప్రాంతాల నుంచి పర్యాటకులు బస్సులలో సరుగుడు జలపాతానికి తరలివచ్చారు. జాల్లువారే నీటిలో జలకాడుతూ సాయంకాలం వరకు కేరింతలు కొడుతూ ఉల్లాసంగా గడిపారు. సరుగుడు జలపాతం చుట్టూ కొండల మధ్య జాలువారుతున్న జలపాతం సోయగాలు చూసి పర్యాటకులు పరవశించిపోయారు. అలాగే తాండవ రిజర్వాయర్ కూడా నిండుకుండలా ఉండటంతో అక్కడికి పర్యాటకులు వెళ్లి, అందాలను ఆస్వాదించారు. టీపీపీ ప్రభుత్వ హయాంలో సరుగుడు జలపాతం, తాండవ రిజర్వాయర్ వద్ద పార్కులు ఏర్పాటు చేయడంతో పర్యాటకులు షెల్టరు దొరికిందని ఆనందపడ్డారు.

పేదలందరికీ సొంతిల్లు సమకూరుస్తాం

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు


మాట్లాడుతున్న హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు

అనకాపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత నేత ఎన్టీ రామారావు ప్రతీ పేదోడికి సొంత ఇల్లు ఉండాలనే ఆశయానికి అనుగుణంగా కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు సొంత ఇల్లు సమకూర్చేందుకు కృషి చేస్తున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ అధ్యక్షుడు జిల్లా బత్తుల తాతయ్యబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 2029 నాటికి ప్రతీ పేదవాడికి సొంత ఇల్లు ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గడిచిన 16 నెలల్లో రాష్ట్రంలో పీఎంఏవై కింద 2,13,180 గృహాలు, పీఎంఏవై (జి) పథకం కింద 66,397 గృహాలు, పీఎంజేఎం కింద 5,980 గృహాలు కలిపి మొత్తం 2,85,557 గృహాలు పేదల కోసం నిర్మించామని చెప్పారు. ఇప్పటికే వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడం ద్వారా 3 లక్షల గృహాలను పేదలకు అందించనున్నామని తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇళ్ల నిర్మాణంలో జాప్యం లేకుండా 3 లక్షల ఇళ్లను పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలు చేయిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. నాడు పేదల ఇళ్ల నిర్మాణాల కోసం అన్న ఎన్టీఆర్ పరితపించారని, సీఎంగా చంద్రబాబునాయుడు అన్న ఆశయాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణాలతో పాటు రోడ్లు, నీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి అన్ని మౌలిక సదుపాయాలు ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం హయాంలో పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెడు సెంట్లు ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని వారికి కూడా ప్రభుత్వం సాయం చేయనుందని తెలిపారు. 2029 నాటికి ప్రతీ అర్హుడికి పక్కా ఇల్లు ఇవ్వడంప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం హయాంలో సెంటు పట్టా పేరుతో జగన్‌రెడ్డి దోపిడీ పర్వం సాగించారని ఆరోపించారు. పేదల ఇళ్ల నిర్మాణాల పేరుతో ఇసుక, సిమెంట్ కొనుగోళ్ల ముసుగులో ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆయన విమర్శించారు.

స్థలాలు, ఇళ్ల మంజూరుకు వైసీపీ నేతల వసూళ్లు

▸▸ రోలుగుంట ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ


విలేకర్లతో మాట్లాడుతున్న సుర్ల రామకృష్ణ

రోలుగుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం హయాంలో పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరులో ఆ పార్టీ నాయకులు డబ్బులు వసూళ్లు చేసి దోచుకున్నారని రోలుగుంట ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ ఆరోపించారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ రోలుగుంట మైనింగ్ కార్యకలాపాల్లో అక్రమాలు జరుగుతున్నాయని, ఇక్కడ వసూళ్లు చేసిన సొమ్ము లోకేశ్, సీఎంల ఖాతాలకు చేరుతుందని స్థానిక వైసీపీ నేత ఆరోపించడాన్ని ఖండించారు. మైనింగ్ కార్యకలాపాల్లో ఎటువంటి అక్రమాలు జరగలేదని ప్రభుత్వ జీఓ, నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయన్నారు. వాటి అనుగుణంగానే సీనరేజీ వసూళ్లు చేస్తున్నారన్నారు. రాజ్యాంగ బద్ధమైన ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తుల గురించి మాట్లాడడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పేదలకు మంచి పరిపాలన అందిస్తున్నారన్నారు.

గవిరెడ్డి మెట్ట కాలనీవాసుల నీటి కష్టాలు తీర్చండి

రోలుగుంట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తమ కాలనీలోని నీటి కష్టాలు తీర్చాలని బుచ్చెంపేట గవిరెడ్డి మెట్టపై ఉన్న కాలనీవాసుల మంగళవారం ఎంపీడీఓ నాగేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రతి రోజూ తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని, తాగునీరు తెచ్చుకోవడానికి పనులు మానుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. గవిరెడ్డి మెట్టపై మినీ వాటర్ ట్యాంకు నిర్మించి తాగునీటి కొరత సమస్యను తీర్చాలని కోరారు. ఇప్పటికే పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కాలనీవాసులు వబ్బలరెడ్డి రమణ, గ్రంధి రాము, ఇ.పద్మావతి, గాలి మహాలక్ష్మి, ఇ.అప్పలనాయుడు, జిగిరెడ్డి నారాయణమ్మ, షేక్ సత్తమ్మ తదితరులు తెలిపారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం


కొత్తకోటలో స్వామిని ఊరేగింపు చేస్తున్న అయ్యప్ప స్వాములు

రావికమతం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామిని వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు. గ్రామ పురవీధుల్లో అయ్యప్పస్వామికి పల్లకి సేవ నిర్వహించారు. ఈసందర్భంగా స్వాములతో పాటు గ్రామస్థులు అయ్యప్ప నామస్మరణ మారుమోగింది. మంగళవారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంబలం పూజ నిర్వహించారు.

రేషన్ డిపోలను తనిఖీ చేసిన తహశీల్దార్


రేషన్ డీలరుపై వచ్చిన ఫిర్యాదుపై విచారిస్తున్న అధికారులు

బుచ్చెయ్యపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెదమదినలోని రెండు రేషన్ డిపోలను మంగళవారం తహశీల్దార్ ఎం.లక్ష్మి తనిఖీ చేశారు. స్టాక్‌ను పరిశీలించారు. అలాగే పెదమదిన 2 నంబర్ డిపో డీలర్‌పై అందిన ఫిర్యాదు మేరకు గ్రామస్థులు, సర్పంచ్ సమక్షంలో లబ్ధిదారులతో మాట్లాడి సరుకులు అందుతున్న వివరాలు, డీలర్ పనితీరుపై విచారణ చేశారు. గ్రామస్థులు, నేతలు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా రేషన్ డీలర్ సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్నాడని తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమములో సీఎస్‌డీటీ, నాయకులు కోలిమళ్ల అచ్చింనాయుడు, కేవీఆర్ నాయుడు, జోగా కొండబాబు,చొప్పా బాబూరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు నిరసన


నిరసన తెలుపుతున్న గిరిజనులు, సీపీఎం నాయకులు

మాడుగుల రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అవురువాడ పంచాయతీలో గ్రానైట్ అనుమతులు రద్దు చేయాలని, చినగొర్రిగెడ్డ గిరిజన మంచినీటి సమస్య పరిష్కరించాలని మంగళవారం స్థానిక గిరిజనులు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోవిందరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి, భవాని నిరసన చేపట్టారు. అవురువాడ పంచాయతీ పరిధిలో మెస్సర్ అటార్నీ ఎంటర్‌ప్రైజెస్ పర్యావరణ అనుమతి సభ నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, పర్యావరణం ఈఈ పైడి వెంకట ముకుందరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా స్థానిక గిరిజనులు, సీపీఎం నాయకులు పలు సమస్యలపై కలుషిత నీరు బాటిల్‌లో చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. గ్రానైట్ క్వారీలతో బోరు బావులు ఇంకిపోయి బురదనీరు వస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో అప్పారావు, రాజుబాబు, కొండమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

గవరవరం కాశీవిశ్వేశ్వరాలయ భూముల కౌలు వేలం రేపు

చోడవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గవరవరంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ భూములకు ఈనెల 13వ తేదీన జి.జగన్నాథపురం సచివాలయం వద్ద కౌలు వేలం నిర్వహిస్తున్నట్టు దేవదాయ ధర్మాదాయ శాఖ ఈవో సత్యనారాయణ తెలిపారు. మూడేళ్ల కాలానికి నిర్వహిస్తున్న కౌలు వేలంలో రైతులు పాల్గొనవచ్చునన్నారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వండి

దేవరాపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లి మేజర్ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు చెల్లించాల్సిన 8 నెలల జీతాలు వెంటనే ఇవ్వాలని ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీను కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ సువర్ణరాజుకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఒక నెల జీతం అందకపోతే రోడ్డెక్కే ఉద్యోగులు 8 నెలలు జీతం అందకపోతే ఎలా బతుకుతారన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

చోడవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు స్థానిక గ్రంథాలయాధికారి ఎంఎస్‌ఎల్ జోగేశ్వరి తెలిపారు. ఈ వారోత్సవాలలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ప్రతిభ కనబరచిన లిఖితకు ఘన సత్కారం


విద్యార్థిని లిఖిత ఆమె తల్లిని సత్కరిస్తున్న గ్రామస్థులు, ఉపాధ్యాయులు

మాడుగుల రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇండో రష్యన్ స్పేస్ కొలాబ్రేషన్ జాతీయ స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచిన కింతలి జడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని కొటారి లిఖితతోపాటు ఆమె తల్లి వెంకటలక్ష్మిని గ్రామస్థులు, ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు మైచర్ల సన్యాసిరావు మాట్లాడుతూ విద్యార్థిని ప్రతిభ వల్ల పాఠశాలకు, గ్రామానికే కాకుండా మండలానికి. జిల్లాకు మంచి గుర్తింపు వచ్చిందని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ భవాని, ఎంఈవో దేముడమ్మ, హెచ్‌ఎం ప్రభాకర్, ప్రసాద్, గ్రామస్థులు సత్యంనాయుడు, కోన భీమేశ్వరరావు, సాయి రెడ్డి, రాము పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : ఎంఈఓలు


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంఈఓలు

కె.కోటపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కె.కోటపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ఎంఈఓలు కె.సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎగ్ కర్రీ, రసంలో సరిపడా ఇంగ్రిడియంట్స్ వేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం తగినన్ని సరుకులు వేసి రుచికరంగా, శుచిగా విద్యార్థులకు భోజనం వడ్డించాలని సూచించారు. ఎండీఎం నిర్వహణలో ఆరు బయట వండరాదని, గ్యాస్ స్టౌవ్ పై వండాలని, వంట పాత్రలు పరిశుభ్రంగా ఉండాలని, విద్యార్థులకు వేడి నీరు ఇవ్వాలని, విద్యార్థులందరూ భోజనానికి ముందు చేతులు పరిశుభ్రంగా కడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.పద్మావతి, ఉపాధ్యాయులు కె. ఈశ్వరరావు పాల్గొన్నారు.

దేవరాపల్లి పీహెచ్‌సీలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు


మందులు తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఇందిరా భారతి

దేవరాపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా డ్రగ్ ఇనస్పెక్టర్ కె.ఇందిర భారతి మంగళవారం తనిఖీ చేశారు. మందులు నిల్వలను పరిశీలించారు. అనంతరం ప్రైవేటు మందులు షాపులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ మందులు షాపుల్లో నిషేధిత మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 50 కేసులు నమోదు చేశామన్నారు. అబార్షన్ కిట్లు, మత్తు మందులు విక్రయిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు.

పార్టీ కోసం కష్టపడే వారికి సముచిత స్థానం

▸▸ ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు


రావికమతం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడే వారికి టీడీపీలో ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు అన్నారు. మంగళవారం మండలంలోని కల్యాణపు లోవ పోతురాజుబాబు ఆలయం వద్ద నియోజకవర్గంలోని నాలుగు మండలాల నూతన మండల పార్టీ అధ్యక్షులు, కాపు, గవర కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఇతర కమిటీలతో ఎమ్మెల్యే రాజు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పదవుల కోసం పాకులాట వద్దని, పార్టీ కోసం నిబద్ధతతో పని చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల బరిలోకి ప్రజాదరణ ఉన్నవారినే ఏకాభిప్రాయంతో ఎంపిక చేయాలన్నారు. వైసీపీ నేతల కుయుక్తులు, ఎత్తుగడలకు లోనుకావద్దని హితబోధ పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు, గవర కార్పొరేషన్ బోర్డుల డైరెక్టర్లు రాజాన కొండనాయుడు,గంగాధర్, రావికమతం, రోలుగుంట, బుచ్చెయ్యపేట,చోడవరం మండలాల పార్టీ అధ్యక్షులు కోమటి శంకరావు, పి.చంద్ర, ఎంపీపీ. సత్యనారాయణ, మత్స్యరాజు, గునూరు మల్లునాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గొర్లె సాంబశివ, టీడీపీ నాయకులు కోట గోవిందరావు, టీడీపీ నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు కోట నీలవేణి, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు సాలాపు రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకున్నది చంద్రబాబే : ఎమ్మెల్యే బండారు


నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):ప్రజలకు ఎలాంటి ఆపదలోనైనా ఆదుకొనేది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాత్రమేనని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం గర్నింగి శివారు కించుమండ, చింతలపూడి గిరిజనులకు ఎంపీడీఓ కార్యాలయంలో నిత్యావసర సరుకులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 291 మందికి పునరావాసం కల్పించామన్నారు. ఇళ్లు లేని పేదవాడికి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అనంతరం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో రాయపురెడ్డి వారి మామిడితోటలో జరిగిన వన భోజనాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్య వైశ్య సంఘం సభ్యులకు ఎటువంటి ఆపదలోనైనా ఆదుకుంటానన్నారు. రాష్ట్ర వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్, జలాశయ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు సూర్యనారాయణ, ఎంపీడీఓ సువర్ణరాజు, సర్పంచ్ పెంటమ్మ, జనసేన మండల అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులుగా మత్స్యరాజు, చిన్న


కనిశెట్టి మత్స్యరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు


ఎర్రంశెట్టి అప్పారావు(చిన్న) పట్టణ అధ్యక్షుడు

చోడవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ చోడవరం మండల అధ్యక్షునిగా గజపతినగరానికి చెందిన కనిశెట్టి మత్స్యరాజు, చోడవరం పట్టణ అధ్యక్షుడిగా అన్నవరానికి చెందిన ఎర్రంశెట్టి అప్పారావు(చిన్న) నియమితులయ్యారు. జూలై నెలలోనే వీరి నియామకం ఖరారైంది. అయితే మహానాడు అనంతరం మండల పార్టీ సమావేశాలు నిర్వహించి వీరి పేర్లను ప్రకటించి ప్రమాణ స్వీకారం చేయిస్తారని భావించారు. అయితే వివిధ కారణాలతో వీరి ప్రమాణ స్వీకార కార్యక్రమం వాయిదాపడింది. మంగళవారం వీరు పదవీ ప్రమాణం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన మత్స్యరాజు గతంలో జెడ్పీటీసీ సభ్యుడిగా కూడా పనిచేశారు. మత్స్యరాజు, ఎర్రంశెట్టి చిన్నలను కూటమి నేతలు అభినందించారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాల పరిశీలన

చోడవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పతో తరగతి పరీక్షల కోసం మండలంలో ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలను మంగళవారం జిల్లా సహాయ పరీక్షా నిర్వాహకులు ఎ. శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్, కొత్తూరు బాలికల హైస్కూల్, పీఎస్‌పేట జెడ్పీ హైస్కూల్, గోవాడ, లక్కవరంతో పాటు, బాష్యం హైస్కూళ్లను సందర్శించి ఈ కేంద్రాలలో సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కె.సింహాచలం, పాండురంగారావు, నోడల్ హెచ్‌ఎంలు ఐ.వి.రామిరెడ్డి, శేషగిరిరావు, సీఆర్‌ఎంటీ కేవీఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ర్యాలీకి అనుమతి నిరాకరణ

▸▸ నేడు ర్యాలీకి పిలుపునిచ్చిన మాజీ ఎమ్మెల్యే గణేశ్


నోటీసు అందుకుంటున్న గణేశ్

నర్సీపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీబీఎం కాంపౌండ్ నుంచి పెదబొడ్డేపల్లి వరకు వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టనున్న ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకరగణేశ్‌కు మంగళవారం నోటీసు అందజేశారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ర్యాలీకి పోలీసులు ఆంక్షలు పెట్టడం సరికాదని ఈ సందర్భంగా గణేశ్ పేర్కొన్నారు. అయినప్పటికీ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు బుధవారం ఉదయం 9 గంటలకు సీబీఎం కాంపౌండ్ వద్దకు రావాలని, అక్కడి నుంచి ర్యాలీ కొనసాగుతుందని ఆయన పలుపునిచ్చారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుతమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు



అనూ ఇమ్మాన్యుయేల్

'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.



కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం

'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సేమీడియాతో పంచుకున్నారు.

● కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.

● నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..



-ఈషా డియోల్

బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.

భారీ యాక్షన్ డ్రాప్‌లో




కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది



- అక్కినేని నాగార్జున

'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్నగారి 'మూగ మనసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వేగర సిల్వర్ స్ర్కీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్ర్కీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్, శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చేప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు మందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా రోలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రోలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.

'ట్రావెల్ యాజ్ యు లైక్' టికెట్ సమయం పెంపు

అనకాపల్లి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'ట్రావెల్ యాజ్ యు లైక్' టికెట్ వినియోగ సమయం పెంచినట్టు డీపీటీవో వి.ప్రవీణ తెలిపారు. ఇక్కడి నుంచి ఎవరైనా విశాఖ నగరానికి ప్రయాణమైనప్పుడు అనకాపల్లి నుంచి లంకెలపాలెం వరకు టికెట్ తీసుకొని అక్కడ కండక్టర్‌కు రూ.100 ఇచ్చి 'ట్రావెల్ యాజ్ యు లైక్' టికెట్ తీసుకొని ప్రయాణం సాగించేవారన్నారు. ఇప్పటి వరకు ఈ టికెట్ రోజులో ఏ సమయంలో తీసుకున్నప్పటికీ అర్ధరాత్రి 11.59 గంటలతో గడువు ముగిసేదన్నారు.

అయితే బుధవారం నుంచి ప్రయాణికుడు టికెట్ పొందిన సమయం నుంచి 24 గంటల వరకు వినియోగించుకునేలా ఆర్టీసీ యాజమాన్యం సవరణలు చేసిందని ఆమె తెలిపారు.

కూటమి పాలనలో పారిశ్రామికాభివృద్ధి

» హోం మంత్రి అనిత
» ఆక్వా పరిశ్రమకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన హోం మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్

నక్కపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో పారిశ్రామికాభివృద్ధి జరుగుతుందని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని నల్లమట్టిపాలెం వద్ద ఒక ప్రైవేటు ఆక్వా పరిశ్రమ నిర్మాణానికి మంగళవారం సాయంత్రం కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం అనిత మాట్లాడుతూ, రైతుల త్యాగం, ప్రజల సహకారంతో అనేక పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని, దీనివల్ల స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. ఇక్కడ ఏర్పాటు చేయనున్న ఆక్వా పరిశ్రమలో సుమారు ఆరు వేల మందికి ఉపాధి దొరకుతుందని చెప్పారు. గత ప్రభుత్వం చెత్తపై పన్ను వేస్తే, తమ ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారు చేస్తున్నదని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, పార్టీ మండల అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, నాయకులు కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి బుజ్జి, పెదిరెడ్డి చిట్టిబాబు, మేరుగు నాగేశ్వరరావు, చింతలపు పద్దు, గోసల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో విశాఖ

» హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాలు

నక్కపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14, 15 తేదీల్లో పార్టనర్‌షిప్ సమ్మిట్ జరుగుతున్నందున్న విశాఖ నగరంలో అణువణువునా గస్తీ ఏర్పాటుచేయాలని పోలీస్ అధికారులను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. మంగళవారం రాత్రి నక్కపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఉమ్మడి విశాఖ జిల్లా పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. విశాఖ నగరమంతా డ్రోన్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండాలన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమ్మిట్‌కు ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబునాయుడు సహా జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరవుతారని, అందుచేత నగరమంతా కట్టుదిట్టమైన భద్రత చేపట్టాలన్నారు. ఫైర్ సేఫ్టీ, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా వుంచాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎల్లప్పుడూ అప్రమత్తంగా వ్యవహరించాలని, ఉన్నతాధికారులు నిరంతర పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు.

మురికి కూపంగా పుష్కరిణి

... 5వ పేజీ తరువాయి

అడుగుభాగంలో కాంక్రీటు నిర్మాణం, చెరువులో బోర్లు తవ్వించడం వంటి పనులు చేయాలి. తొలుత చెరువు చుట్టూ పూడిక తొలగించే పనులు ప్రారంభించారు. కొద్ది రోజుల తరువాత హఠాత్తుగా పనులు నిలిపివేశారు. అప్పటి నుంచి పునరుద్ధరణకు నోచుకోలేదు. ఈ ఏడాది కార్తీక మాసం నాటికైనా పుష్కరిణి అందుబాటులోనికి వస్తుందని భక్తులు భావించారు. కానీ ఫలితం లేకపోయింది.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా తేజ్ భరత్

... 5వ పేజీ తరువాయి

తరువాత ఆ పనుల్లో పెద్దగా పురోగతి లేకుండా పోయింది. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి వెళ్లడంతో పూర్తిస్థాయి అధికారిని నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. నగరంలో ఈ నెల 14, 15 తేదీల్లో పెట్టుబడుల సదస్సు జరగనున్న ఉన్న నేపథ్యంలో తేజ్ భరత్ వెంటనే విధుల్లో చేరే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి నారా లోకేశ్ విశాఖపట్నం వచ్చేసరికి ఆయన ఇక్కడ బాధ్యతలు తీసుకుంటారని సమాచారం.

పెట్టుబడుల వెల్లువ

... 5వ పేజీ తరువాయి

లక్ష మందికిపైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కలుగుతాయి.

సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేసిన పరిశ్రమలు

» బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ (యాక్షన్ టెస్లా) సెజ్ పరిధిలోని రాంబిల్లి మండలంలో రూ.1,175 కోట్ల వ్యయంతో ఇంటీరియర్‌కు వినియోగించే హెచ్‌డీఎంఆర్ బోర్డుల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నది. దీనికి ప్రభుత్వం 105.72 ఎకరాలను కేటాయించింది. ఈ కంపెనీలో ఉత్పత్తి ప్రారంభం అయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,000 మందికి ఉపాధి, ఉద్యోగాలు కలుగుతాయి.

» లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ పరవాడ జేఎన్‌పీసీలో 15 ఎకరాల్లో రూ.200 కోట్లతో యూనిట్-7ను ఏర్పాటు చేయనున్నది. ఇందులో ప్రత్యక్షంగా, పరోక్షంగా 500 మందికి ఉపాధి లభిస్తుంది.

» లారస్ సింథసిస్ ప్రైవేటు లిమిటెడ్ పరవాడ జేఎన్‌పీసీలో 15 ఎకరాల్లో రూ.80 కోట్లతో యూనిట్-3ను ఏర్పాటు చేయనున్నది. ఇందులో ప్రత్యక్షంగా, పరోక్షంగా 500 మందికి ఉపాధి లభిస్తుంది.

» ఇండియా ఫార్మాస్యూటికల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ రాంబిల్లి మండల పరిధిలోని సెజ్‌లో 8.53 ఎకరాల్లో రూ.150 కోట్లతో ఫార్మా ఉత్పత్తుల తయారీ కంపెనీని ఏర్పాటు చేస్తున్నది. ఇందులో ప్రత్యక్షంగా, పరోక్షంగా 500 మందికి ఉపాధి లభిస్తుంది.

» స్టైరెక్స్ లైఫ్ సైన్సెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ రాంబిల్లి మండల పరిధిలోని సెజ్‌లో 4.08 ఎకరాల్లో రూ.88 కోట్లతో కంపెనీని ఏర్పాటు చేస్తున్నది. ఇందులో ప్రత్యక్షంగా, పరోక్షంగా 100 మందికి ఉపాధి కలుగుతుంది.

» ఎస్.రాయవరం మండలం జంగులూరులో 10.96 ఎకరాల్లో రూ.10.96 కోట్లతో నిర్మించే ఎస్ఎం సీ కార్పొరేషన్ ఎల్ఎల్‌పీ యూనిట్‌ను, మరో 12.49 ఎకరాల్లో రూ.573 కోట్లతో చేపట్టనున్న బల్క్ డ్రగ్స్, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్ ప్రొడెక్స్ పనులకు శంకుస్థాపన చేశారు.

సీఎం చంద్రబాబు ప్రారంభించిన పరిశ్రమలు

» అచ్యుతాపురం సెజ్‌లో 97.11 ఎకరాల్లో రూ.700 కోట్లతో నిర్మించిన ఏటీసీ టైర్స్ ఏపీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రారంభమైంది. ఇందులో 300 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించనున్నారు.

» రాంబిల్లి మండల పరిధిలోని సెజ్‌లో 24.22 ఎకరాల్లో రూ.706 కోట్లతో లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ నిర్మించిన యూనిట్-8ను సీఎం ప్రారంభించారు. దీని ద్వారా 675 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించానున్నారు.

క్రైం... crime news

కొక్కిరాపల్లి రోడ్డు ప్రమాదంలో మరొకరి మృతి



కొరుప్రోలు కనక (ఫైల్ ఫొటో)

ఎలమంచిలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని కొక్కిరాపల్లి వద్ద జాతీయ రహదారిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిలో మరొకరు మృతిచెందారు. రూరల్ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3వ తేదీన కొక్కిరాపల్లి వద్ద ప్రయాణికులను దించడానికి డ్రైవర్ ఆటోను రోడ్డు ప్రక్కన ఆపాడు. వెనుక నుంచి వసస్తున్న టాటా మ్యాజిక్ వాహనం డ్రైవర్ ఈ విషయం గమనించకుండా వేగంగా వచ్చి, ఆటోను వెనుక నుంచి బలంగా ఢీకొన్నాడు. దీంతో కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన గొంది పెంటయ్య, నర్సీపట్నం మునిసిపాలిటీ దనిమిరెడ్డి వీధికి చెందిన బాదంపూడి లక్ష్మి తీవ్రంగా గాయపడి మృతిచెందిన విషయం తెలిసిందే. మిగిలిన క్షతగాత్రులను అనకాపల్లి, విశాఖ ఆస్పత్రులకు తరలించారు. వీరిలో మాకవరపాలెం మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన కొరుప్రోలు కనక(37) కేజీహెచ్‌లో చికిత్సపొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందిందని పోలీసులు తెలిపారు. దీంతో ఈ ప్రమాదంలో మృతిచెందిన వారి సంఖ్య మూడుకు చేరింది.

బయ్యవరం చెరువులో గుర్తుతెలియని మృతదేహం

కశింకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం పెద్దచెరువులో మంగళవారం గురుతెలియని వ్యక్తి మృతదేహం తేలిందని సీఐ ఎ.స్వామినాయుడు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి పరిశీలించారని, గుర్తుపట్టలేనంతా కుళ్లిపోయినందని చెప్పారు. మృతుడి వయసు 45-50 ఏళ్లు వుంటాయని, బయ్యవరం వీఆర్వో ఆర్.నారాయణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆలయంలో 200 తులాల వెండి ఆభరణాలు అపహరణ



ఆలయంలో విచారిస్తున్న పోలీసులు

లంకెలపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పరవాడ మండలం పెద ముషివాడలో వున్న శ్రీదుర్గా మల్లీశ్వరి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. సుమారు 200 తులాల వెండి ఆభరణాను అపహరించుకుపోయారు. సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి తరువాత లయం ప్రధాన ద్వారం గ్రిల్స్‌ను విరగొట్టి లోపలికి ప్రవేశించారు. గర్భగుడి తలుపులు పగలగొట్టి అమ్మవారికి అలంకరించిన సుమారు 200 తులాల వెండి ఆభరణాలతో పాటు లోపల ఉన్న మూడు బస్తాల బియ్యం ఎత్తుకుపోయారు. మంగళవారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి కల్యాణ్ దొంగతనం జరిగినట్టు గుర్తించి గ్రామ పెద్దలకు సమాచారం ఇచ్చారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ మల్లికార్జునరావు వెళ్లి పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589